


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న


RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 71, పేజీలు - 08
గురువారం, ఆగష్టు 14, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక HYDERABAD

# తెలంగాణలో ప్రాజెక్టు పాలిటిక్స్

## తుమ్మిడిహట్టిపై కాంగ్రెస్ వ్యూహం ఏమిటి.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణలో రాజకీయ అలజడి కొనసాగుతున్న వేళ, మరో ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం చర్చకు పెడుతోంది. ఆ ప్రాజెక్టు పేరు తుమ్మిడిహట్టి. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టులో భాగం. కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్మించి తీరుతామని చెబుతోంది. అయితే అందుకు గల కారణాలు ఏమిటో ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.

### ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు చరిత్ర ఇదే..

ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును 2004లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. నాటి ముఖ్యమంత్రి, స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి, దీన్ని ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టులో తుమ్మిడిహట్టి ముఖ్యమైనది. ఆదిలాబాద్ జిల్లాలోని కౌటాల మండలంలో ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తులో ఒక బ్యారేజీ నిర్మించాలన్నది నాటి ప్రణాళిక. ఈ బ్యారేజీ ద్వారా నీటిని ఎత్తిపోసి ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, మెదక్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అయితే ఈ ప్రాజెక్టుపై మహారాష్ట్ర అభ్యంతరం లేవనెత్తింది. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు, రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టింది.మహారాష్ట్ర ప్రభుత్వం బ్యారేజీ ఎత్తును 148 మీటర్లకు తగ్గించాలని సూచన చేసింది. దీంతో 2014లో నాటి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టును రీడిజైన్ చేసింది. ఈ కారణంగా తుమ్మిడిహట్టి వద్ద నిర్మించాల్సిన బ్యారేజీని పక్కన పెట్టి మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం వద్ద మూడు బ్యారేజీలను కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. దీనిపై నాటి నుంచి నేటి వరకు అనేక రాజకీయ, సాంకేతిక విమర్శలు వస్తూనే ఉన్నాయి. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం ఏర్పాటు చేసిన పీసీ ఘోష్ కమిషన్ చాలా తప్పులను ఎత్తిచూపింది.

### తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ప్రయోజనాలు ఇవే..

ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీని నిర్మించాల్సి ఉంది. ఈ డిజైన్ చాలా సాధారణమైనదని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. ఇక్కడ బ్యారేజీ నిర్మిస్తే ఎలాంటి ఎత్తిపోతలు అవసరం లేకుండా గ్రావిటీ (గురుత్వాకర్షణ శక్తి) ద్వారా కాలువల గుండా నీటిని ఆదిలాబాద్ జిల్లాలోని సాగు భూములకు తరలించవచ్చు అని చెబుతోంది. అంటే ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టులలో భారీ మోటార్లు, పంపులు ఏర్పాటు చేసి నీటిని ఎత్తిపోస్తున్నారు. అలా కాకుండా గ్రావిటీ ద్వారా కెనాల్స్‌లో నీరు ప్రవహిస్తుంది. దీనివల్ల ప్రాజెక్టు వ్యయం తగ్గుతుంది.

2లో..

## ఐఎంఏ పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** సాంప్రదాయ వైద్యం ఆయుర్వేదానికి సంబంధించి తప్పుదోవ పట్టించే ప్రకటనలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆగస్టు 11న దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. పతంజలి ఆయుర్వేదానికి వ్యతిరేకంగా ఐఎంఏ కోర్టును ఆశ్రయించడంతో ఈ కేసు వివాదం మొదలైంది. పతంజలి ప్రకటనలు తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని, ఆధునిక వైద్యానికి

2లో..

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

- భారీ వర్షాలు, వరదలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- కృష్ణా నదికి 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉందని అంచనా
- లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం
- వరద నీటితో సోమశిల, కండలేరు ప్రాజెక్టులను నింపాలని కీలక సూచన
- చెరువుల గట్లను పటిష్టం చేయాలని, తూడు తొలగించాలని ఆదేశం

2లో..



## ఎమ్మెల్సీ నియామకాలపై సుప్రీం సంచలన తీర్పు

- కోదండరాం, అమీర్ అలీఖాన్‌కు బిగ్ షాక్
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులు రద్దు
- సుప్రీంను ఆశ్రయించిన దాసోజు శ్రవణ్, సత్యనారాయణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కోదండారం, అమీర్ అలీ ఖాన్‌లు మాజీ ఎమ్మెల్సీలు అయ్యారు. గవర్నర్ కోటాలో వారి నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేసింది. దాసోజు శ్రవణ్, సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపి సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తాజాగా నామినేట్ చేసే పేర్లు కూడా తుది తీర్పునకే లోబడి ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. 2023 ఆగస్టులో, భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం దాసోజు శ్రవణ్ మరియు కుర్ర సత్యనారాయణలను గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. అయితే, అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఈ నామినేషన్లను సెప్టెంబర్ 19, 2023న "రాజకీయ సంబంధం ఉన్న వ్యక్తులు" అనే కారణంతో తిరస్కరించారు. ఆ తర్వతా కాంగ్రెస్ సీఎం కేసీఆర్ ఎవర్నీ నామినేట్ చేయలేదు. మళ్లీ వారి పేర్లే పంపితే గవర్నర్ కచ్చితంగా ఆమోదించాల్సి ఉండేది. కానీ పంపలేదు. ఈ లోపు ఎన్నికలు వచ్చాయి. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత,

2లో..

## హాట్ లైన్లో టచ్‌లో చంద్రబాబు, రాహుల్, రేవంత్

### - జగన్ షాకింగ్ ఆరోపణ

అమరావతి (ప్రశ్న న్యూస్) జాతీయ స్థాయిలో లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఓట్ల చోరీ ఆరోపణలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంచలన కామెంట్స్ చేశారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ గురించి మాట్లాడుతున్న రాహుల్ గాంధీ ఏపీపై ఎందుకు మాట్లాడరని ఆయన ప్రశ్నించారు. దీని వెనుక చంద్రబాబు, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి హాట్ లైన్ లో టచ్ లో ఉండటమే కారణమన్నారు. ఏపీలో గత ఎన్నికల సందర్భంగా జరిగిన అక్రమాలపై ఇప్పటివరకూ కాంగ్రెస్ నేతలు స్పందించలేదన్నారు. ఇప్పటికే ఈసీ

2లో..



## నాకు ముప్పు పొంచి ఉండొచ్చు



- పుణే కోర్టుకు తెలిపిన రాహుల్ గాంధీ
- అవసరమైన భద్రత కల్పించడం కేంద్రం బాధ్యత అన్న రాహుల్ గాంధీ
- రాహుల్ గాంధీ ఆరోపణలను కొట్టి పారేసిన పిటిషనర్ సాత్యకి

పుణే (ప్రశ్న న్యూస్) వీర సావర్కర్, నాథూరాం గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారి నుంచి తనకు ముప్పు పొంచి ఉండవచ్చని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. సావర్కర్‌ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై పరువునష్టం కేసు నమోదైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో

2లో..

## భారత్-రష్యా మైత్రి

### - మాస్కోలో జైశంకర్, లావ్రోవ్ కీలక భేటీ



మాస్కో (ప్రశ్న న్యూస్) భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతోంది. ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి సమావేశాలు, పర్యటనలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మధ్య మరో కీలక భేటీ జరగనుంది.

ఈ నెల ఆగస్టు 21న మాస్కోలో వీరిద్దరూ సమావేశం కానున్నారు. ఈ విషయాన్ని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం అధికారికంగా ధృవీకరించింది. ద్వైపాక్షిక ఎజెండాలోని ముఖ్యమైన అంశాలతో పాటు, అంతర్జాతీయ వేదికలపై సహకారం గురించి ఇరువురు నేతలు చర్చిస్తారని ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల భారత జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ మాస్కోలో పర్యటించిన కొద్ది రోజులకే ఈ సమావేశం జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. తన పర్యటనలో దోవల్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు, ఇతర ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు.గత కొంతకాలంగా

2లో..

## సెమీకండక్టర్ ప్రాజెక్టుపై తెలంగాణకు కేంద్రం అన్యాయం

- ఒక్క ఎకరా లేకుండానే ఏపీకి సెమీకండక్టర్ యూనిట్
- అన్ని సౌకర్యాలు ఉన్నా తెలంగాణకు శూన్యహస్తం
- కేంద్రం తీరుపై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పొరుగు రాష్ట్రం ఏపీలో సెమీకండక్టర్ తయారీ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. రూ.4600 కోట్ల వ్యయంతో ఏపీ, పంజాబ్, ఒడిశా రాష్ట్రాలలో సెమీకండక్టర్ల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పీఎం మోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో నిర్ణయించారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్‌లో భాగంగా ఇండియాలో మరో నాలుగు సెమీకండక్టర్ ప్రాజెక్టులు చేపట్టాలనే ప్రతిపాదనకూ కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. అయితే కేంద్రం నిర్ణయంపై తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని ట్వీట్ చేశారు. సెమీకండక్టర్ రంగంలో ప్రపంచ స్థాయి

2లో..

## భూమి లేని రైతులకు తీపి కబురు

### - ప్రభుత్వం అసైన్డ్ కమిటీల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భూమి లేని నిరుపేదలకు త్వరలో ప్రభుత్వం నుంచి భూముల పంపిణీ జరగనుంది. ఈ నిర్ణయంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. తెలంగాణ ప్రభుత్వం అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో అసైన్డ్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ కమిటీలు కేవలం పాత సమస్యలను

2లో..



## ఆవిష్కృతమైన జలదృశ్యం

### - నిండుకుండల్లా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారీగా కురుస్తున్న వర్షాలు, వరదల కారణంగా కృష్ణా నదికి వరద పోటెత్తుతుంది. నేడు జూరాల, సుంకేసుల నుండి 1, 53, 373 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం ప్రాజెక్టుకు వచ్చే

2లో..

# తెలంగాణలో ప్రాజెక్టు పాలిటిక్స్

భారీ మోటార్లు, పంపులు అవసరం లేదు, విద్యుత్ ఖర్చు మిగులుతుంది. అతి తక్కువ ఖర్చుతోనే తుమ్మిడిహట్టి ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వచ్చని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది.

### తుమ్మిడిహట్టి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వ పెద్దలు చెబుతున్న కారణాలు ఇవే

కాళేశ్వరం ప్రాజెక్టులో ఉన్న సాంకేతిక లోపాలే తుమ్మిడిహట్టి ప్రాజెక్టు నిర్మాణానికి ముఖ్య కారణమని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. పీసీ ఘోష్ నివేదిక ప్రకారం, కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్, నిర్మాణం, నిర్వహణలో లోపాలను స్పష్టంగా ఎత్తిచూపిందని, మేడిగడ్డ బ్యారేజీ అస్థిరమైన ఇసుక నేల మీద నిర్మించారని, దీనివల్ల పిల్లర్లు ఇసుకలో కూరుకుపోయాయని తన నివేదికలో తెలిపింది. దీంతో ఈ ప్రాజెక్టు భవితవ్యంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇదే కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేమని, ఇది ఎంత సురక్షితమో కూడా చెప్పలేమని కాంగ్రెస్ మంత్రులు చెబుతున్నారు. తుమ్మిడిహట్టి వద్ద రబ్బర్ డ్యాం నిర్మించి, దాని ద్వారా నీటిని సుందిళ్ల, ఎల్లంపల్లి బ్యారేజీలకు తరలిస్తామన్నది ప్రభుత్వ ఆలోచనగా చెబుతున్నారు. దీనివల్ల తాత్కాలికంగా తక్కువ ఖర్చుతో నీటిని తరలించే ప్రత్యామ్నాయ ప్రణాళికగా పేర్కొంటోంది. అంతేకాకుండా, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ కోసం అయ్యే భారీ ఖర్చు కూడా తగ్గుతుందని లెక్కలు చెబుతోంది.

### తుమ్మిడిహట్టి ప్రాజెక్టు నిర్మాణం వెనుక రాజకీయ కారణాలు ఇవేనా.?

ఏ రాజకీయ పార్టీ అయినా అధికారంలోకి వచ్చాక తనదైన ముద్ర అన్ని విషయాల్లో ఉండాలని భావించడం సహజం. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని, డిజైన్లు, నిర్మాణం, నిర్వహణలో లోపాలు ఉన్నాయని పదే పదే చెబుతూ వస్తోంది. కాళేశ్వరం తెలంగాణ వరమని బీఆర్ఎస్ పదేళ్ల పాటు చెబితే, ఇదే తెలంగాణకు శాపమని కాంగ్రెస్ నేతలు విపక్షంలో ఉన్నప్పుడు పదే పదే చెప్పారు. ఇక అధికారంలోకి వచ్చాక, కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ నివేదికలోని అంశాలు కాంగ్రెస్‌కు ఒక పొలిటికల్ గేమ్ చేంజర్గా ఉపయోగపడుతున్నాయి.బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను ఇప్పుడు ఈ కమిటీ నివేదిక ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో చర్చకు పెడుతోంది. తుమ్మిడిహట్టి నిర్మించడం ద్వారా బీఆర్ఎస్ తప్పులను తమ ప్రభుత్వం సరిచేస్తున్నామని చెప్పుకునే అవకాశం కలుగుతుంది. అంతేకాకుండా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పట్టు పెంచుకునే వ్యూహం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

# ఐఎంఏ పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు

చెడ్డపేరు తెచ్చాయని ఐఎంఏ పిటిషన్‌లో పేర్కొంది.

### ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా తొలగించిన రూల్ 170

ఆయుష్ మంత్రిత్వ శాఖ డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ రూల్స్, 1945లోని రూల్ 170ని జులై 1, 2024న తొలగించింది. గత ఏడాది తొలగించిన నిబంధన ప్రకారం ఆయుర్వేద, సిద్ధ వైద్యం, యునాని వైద్యాలను ప్రకటన చేయడానికి రాష్ట్ర లైసెన్సింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ నిబంధనను తొలగించడం వలన తప్పుదారి పట్టించే వాదనలను నివారించడంలో సవాళ్లు పెరిగాయి. ఈ క్రమంలో ఆగస్టు 2024లో సుప్రీంకోర్టులో జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం రూల్ 170ని తొలగించడంపై స్టే ఇచ్చింది. తాత్కాలికంగా ముందస్తు అనుమతి అవసరాన్ని సుప్రీం ధర్మాసనం పునరుద్ధరించింది.

### కేంద్రం తొలగించిన నిబంధనను పునరుద్ధరించలేము

కేంద్రం తొలగించిన తర్వాత రాష్ట్రాలు ఈ నిబంధనను ఇంకా ఎలా అమలు చేయగలవని జస్టిస్ కె.వి. విశ్వనాథన్ ప్రశ్నించారు. ఐఎంఏ కోరిన ప్రధాన బెనిఫిట్స్ ఇప్పటికే నెరవేరాయని జస్టిస్ బి.వి.నాగరత్న సైతం పేర్కొన్నారు. కేంద్రం తొలగించిన నిబంధనను కోర్టు పునరుద్ధరించలేదని ఆమె స్పష్టం చేశారు. గతంలో చేపట్టిన విచారణలలో పతంజలి తప్పుదారి పట్టించే ప్రకటనలు, నియంత్రణ అధికారుల నిర్లక్ష్యం, బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణల దిద్దుబాటు చర్యలపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. పతంజలిపై కోర్టు ధిక్కరణ చర్యలను సుప్రీంకోర్టు చేపట్టింది. ఆ తరువాత కంపెనీ పదేపదే క్షమాపణలు కోరడంతో గత పిటిషన్లపై విచారణ ముగిసింది. కానీ ఆ ప్రకటనలపై నిషేధం విధించడం, ఆయుష్ వైద్యం చేయడానికి అనుమతులు ఇవ్వడం అసహజ వాణిజ్య పద్ధతులను ప్రోత్సహిస్తుందని కూడా సుప్రీం కోర్టు హెచ్చరించింది.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షకు మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, సీఎస్ విజయానంద్ తదితరులు హాజరయ్యారు. విపత్తు నిర్వహణ, వ్యవసాయం, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు కూడా ఈ అత్యవసర సమీక్షలో పాల్గొన్నారు. వాతావరణ శాఖ సూచనల మేరకు రాగల రెండు మూడు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తత చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో వాగులు వంకల నుంచి వచ్చే ఆకస్మిక వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిగువన ఉన్న ప్రాంతాలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కృష్ణా నదిలో గురువారం కల్లా 5 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ నుంచి 35 గేట్లు ఎత్తి 3.09 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు. కాలువలకు 5 వేల క్యూసెక్కుల మేర నీరు విడిచిపెట్టినట్టు అధికారులు సీఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం ప్రకాశం బ్యారేజికి దిగువన ఉన్న ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మరోవైపు ఎగువన నాగార్జునసాగర్, పులిచింతల గేట్లను కూడా ఎత్తినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తక్షణం తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

### వరద నీటిని సద్వినియోగం చేయండి

ఎగువ నుంచి వస్తున్న నీటిని సద్వినియోగం చేసుకునేలా రోజుకు నాలుగు టీఎంసీల చొప్పున తరలించి సోమశిల, కండలేరు ప్రాజెక్టులను నింపాలని సీఎం ఆదేశించారు. వరద నీటిని వృధాగా సముద్రంలోకి పోనీయకుండా సద్వినియోగం చేసుకునేలా సమర్ధ నీటి నిర్వహణ చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. మైలవరం సహా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం బుడమేరు, వెలగలేరులకు పెద్ద ఎత్తున వస్తోందని.. ఈ నీరు కృష్ణా నదిలోకి డిశ్చార్జి చేస్తున్నట్టు తెలిపారు. బుడమేరు డైవర్షన్ ఛానల్ పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్టు వివరించారు. వరద నిర్వహణా పనుల్లో భాగంగా రూ.40 కోట్లతో బుడమేరు- వెలగలేరు యూటీ నిర్మాణాన్ని చేపట్టేందుకు ముఖ్యమంత్రి అనుమతి మంజూరు చేశారు.

### గండ్లు పడకుండా గట్లు పటిష్ట పర్చాలి

మరోవైపు భారీవర్షం కారణంగా కొండవీటి వాగు, పాల వాగులకు వస్తున్న నీటిని కృష్ణా నదిలోకి నాలుగు పంపుల ద్వారా నీటిని ఎత్తి పోస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వర్షకాల సీజన్ లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాలువల్లో నీటి ప్రవాహాలు సక్రమంగా వెళ్లేందుకు వీలుగా గుర్రపు డెక్క, తూడును తొలగించాలని ముఖ్యమంత్రి జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన ఈ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే కాలువలు, చెరువులకు గండ్లు పడకుండా గట్లను పటిష్టం చేయాలని సీఎం సూచించారు. జిల్లాల్లో వర్షాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లు కూడా అప్రమత్తంగా ఉండి రైతులకు తక్షణ సమాచారం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో భూగర్భ జలాలను రీఛార్జి చేసేలా నిర్మాణాలను చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. పంచాయతీరాజ్, అటవీశాఖ అధికారులు ఆయా ట్రెంచ్ లను ఎక్కడెక్కడ చేపట్టాలో ప్రణాళిక చేసుకోవాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ట్రెంచ్ లను తవ్వేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

# నాకు ముప్పు పొంచి ఉండొచ్చు

ఆయన తనకు ముప్పు పొంచి ఉండవచ్చని పుణే కోర్టుకు తెలిపారు. తనకు అవసరమైన భద్రత కల్పించడం కేంద్ర ప్రభుత్వం బాధ్యత అని పేర్కొన్నారు.2023లో లండన్ పర్యటన సమయంలో సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

ఈ క్రమంలో సావర్కర్ మునిమనవడు సాత్యకి సావర్కర్ ఆయనపై పరువు నష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు గతంలో తేల్చారు. దీనిపై పుణేలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది కోర్టుకు తాజాగా ఓ దరఖాస్తును సమర్పించారు.తనకు నాథూరాం గాడ్సే, సావర్కర్ కుటుంబాలతో సంబంధం ఉందని సాత్యకి గతంలో వెల్లడించారని, కాబట్టి ఆయన గత చరిత్రను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుంటే సావర్కర్, గాడ్సే భావజాలానికి మద్దతు ఇచ్చే వ్యక్తుల నుంచి రాహుల్ గాంధీకి ముప్పు పొంచి ఉండే అవకాశాలను కొట్టిపారేయలేమని, ఇలాంటి పరిస్థితుల్లో ఆయనకు రక్షణ అవసరమని పేర్కొన్నారు. విచారణ ఆలస్యం కావడం వల్లే రాహుల్ గాంధీ ఈ అప్లికేషన్ దాఖలు చేశారని సాత్యకి సావర్కర్ ఆరోపించారు. అందులో పేర్కొన్న వాస్తవాలకు, ప్రస్తుత కేసుతో ఎటువంటి సంబంధం లేదని మీడియాతో అన్నారు.

# సెమీకండక్టర్ ప్రాజెక్టుపై తెలంగాణకు కేంద్రం అన్యాయం

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రిమండలి 2024 జనవరి 27న ప్రొఫెసర్ ఎం. కోదండారాం , జర్నలిస్ట్ అమీర్ అలీ ఖాన్ లను గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. గవర్నర్ ఈ నామినేషన్లను ఆమోదించారు. అయితే దాసోజు శ్రవణ్ , కుర్ర సత్యనారాయణ గవర్నర్ తమ నామినేషన్లను తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. హైకోర్టు బెంచ్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సెప్టెంబర్ 2023లో శ్రవణ్, సత్యనారాయణ నామినేషన్లను తిరస్కరించిన ఆదేశాన్ని రద్దు చేసింది, గవర్నర్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5) కింద మంత్రిమండలి సలహా మేరకు పనిచేయాలని పేర్కొంది. కోదండరాం , అమీర్ అలీ ఖాన్‌ల నామినేషన్ నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేసింది.అయితే మళ్లీ కేబినెట్ కొత్తగా సిఫారసు చేయవచ్చని తెలిపింది. దీంతో మరోసారి కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌లను తెలంగాణ కేబినెట్ సిఫారసు చేసింది. దాసోజు శ్రవణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టులో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ అప్పీల్ చేశారు. విచారణలో కోదండారాం, అమీర్ అలీ ఖాన్‌ల ఎమ్మెల్సీ నియామకాలపై ఆంక్షలను సుప్రీంకోర్టు తొలగించింది. దాంతో వీరిద్దరూ వారు ఆగస్టు 16, 2024న తెలంగాణ శాసనమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది.అయితే తమనే ఎమ్మెల్సీగా నియమించేలా ఆదేశాలు ఇవ్వాలన్న శ్రవణ్, కుర్ర సత్యనారాయణలకు నిరాశే ఎదురయింది. ఎమ్మెల్సీలను సిఫారసు చేయాల్సింది కేబినెట్ కాబట్టి అలాంటి ఆదేశాలను సుప్రీంకోర్టు జారీ చేయలేదు. అందుకే.. తాజా నియామకాలు కూడా తుది తీర్పునకు లోబడి ఉంటాయని సుప్రీంకోర్టు చెప్పింది. అయితే దాసోజు శ్రవణ్ ఇప్పటికే ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అయ్యారు.

# హాట్ లైన్లో టచ్‌లో చంద్రబాబు, రాహుల్, రేవంత్

ముందు గత ఎన్నికల్లో తమకు జరిగిన అన్యాయాన్ని వివరించామని జగన్ తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ మధ్య 12 శాతం ఓట్ల తేడా కనిపించిందన్నారు. పోలింగ్ తర్వాత కౌంటింగ్ లో రాష్ట్రంలో ఏకంగా 48 లక్షల ఓట్లు పెరిగాయన్నారు. దీనికి స్పందనగా ఏపీలోనూ ఓటర్ల జాబితా సవరణ చేస్తామని ఈసీ చెప్పిందన్నారు. అయినా దీనిపై కాంగ్రెస్ పార్టీ స్పందించకపోవడం వెనుక కీలక కారణాలున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వంద విధానాలకు ఇది నిదర్శనం అన్నారు.రాహుల్ గాంధీ ఏపీ గురించి ఎందుకు మాట్లాడకపోవడం వెనుక చంద్రబాబుతో టచ్ లో ఉండటమే కారణమని జగన్ ఆరోపించారు. ఏపీలో అరాచకాలపై కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జ్ మాణిక్కం ఠాకూర్ ఎప్పుడైనా మాట్లాడారా అని నిలదీశారు. చంద్రబాబు ప్రభుత్వంలో అరాచకాలపై మాత్రం వారు మాట్లాడరన్నారు.రాహుల్, రేవంత్, చంద్రబాబు హాట్ లైన్ లో టచ్ లో ఉన్నారని జగన్ తెలిపారు. లేకపోతే రేవంత్, రాహుల్ ఏపీ గురించి ఎందుకు మాట్లాడరని అడిగారు. తన హయాంలో పీపీఏలపై కోర్టులకు వెళ్లి ఆరోపణలు చేశారని, కానీ ఇప్పుడు పీపీఏలు అంతకన్నా ఎక్కువ రేట్లకు చేసుకుంటున్నారని, కానీ వీటిపై కాంగ్రెస్ ఎందుకు మాట్లాడటం లేదని జగన్ ప్రశ్నించారు. లులూ మాల్ విషయంలోనూ అదే జరుగుతోందన్నారు. రాహుల్ ఢిల్లీలో ఓట్ల చోరీ గురించి మాట్లాడుతూ ఏపీ గురించి ఎందుకు మాట్లాడటం లేదన్నారు. అందుకే తాము కాంగ్రెస్ ఓట్ల చోరీ ఉద్యమానికి మద్దతు ఇవ్వడం లేదన్నారు.

# ఆవిష్కృతమైన జలదృశ్యం

చేరుతుంది. కృష్ణానది పరివాహక ప్రాంతాల నుండి వస్తున్న వరద ఉధృతి కారణంగా శ్రీశైలం జలాశయం జలకళతో తొణికిసలాడుతుంది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 883 అడుగులకు చేరడంతో, నిన్నటి నుండి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.మొత్తం నాలుగు రేడియల్ క్రస్ట్ గేట్లను పది అడుగుల మేర పైకి లేపి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ సంవత్సరం శ్రీశైలం గేట్లు ఎత్తి నాగార్జునసాగర్ కు నీటిని విడుదల చేయడం ఇది మూడోసారి. ఎగువన ఉన్న జూరాల, సుంకేసుల, హంద్రీ నదుల కారణంగా శ్రీశైలానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రస్తుతానికి శ్రీశైలం జలాశయానికి ఇన్ ఫ్లో 2,23,802 క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో 1,73, 949 క్యూసెక్కులు.శ్రీశైలం పూర్తి జల సామర్థ్యం 215.8070 క్యూసెక్కులు కాగా, ప్రస్తుతం ఉన్న నీటి సామర్థ్యం 203.4290 టీఎంసీలు. ఇక శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తడం తో పర్యాటకులు ఈ సుందర జల దృశ్యాన్ని చూడడానికి పోటెత్తుతున్నారు.ఇదిలా ఉంటే శ్రీశైలం ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో, నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండ లాగా మారింది.నాగార్జునసాగర్ లో 26 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.నాగార్జున సాగర్ జలాశయం వద్ద ఇన్ ఫ్లో 2,28,601 క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 2, 47 , 986 క్యూసెక్కులుగా ఉంది. నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 589. 20 అడుగులుగా నమోదయింది. నాగార్జునసాగర్ యొక్క పూర్తి నీటి సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా ప్రస్తుతం 309.65 టీఎంసీలకు నీరు చేరుకుంది. పూర్తిస్థాయి నీటిమట్టంతో నాగార్జునసాగర్ ప్రస్తుతం జలకళను సంతరించుకుంది. నిండుకుండ లాగా తోస్తోంది.

# భూమి లేని రైతులకు తీపి కబురు

పరిష్కరించడమే కాకుండా కొత్తగా భూములను గుర్తించి, అర్హులైన వారికి పంపిణీ చేసే బాధ్యతను కూడా తీసుకుంటాయి. రెవెన్యూ శాఖ ఈ మేరకు రూపొందించిన ప్రతిపాదనలు ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరాయి. త్వరలోనే దీనిపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

### అసైన్డ్ భూముల సమస్యలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ప్రభుత్వ భూములను అసైన్డ్ చేసింది. అయితే.. కాలక్రమేణా ఈ భూములు అన్యాక్రాంతమయ్యాయి. చాలా చోట్ల అసైన్డ్ పట్టాలు ఉన్నా.. భూమి లేని పరిస్థితి ఏర్పడింది. మరికొందరికి భూమి ఉన్నా రికార్డుల్లో పేరు నమోదు కాలేదు. ఈ గందరగోళానికి పరిష్కారం చూపడానికి, తెలంగాణ ప్రభుత్వం ఈ కమిటీలను ఏర్పాటు చేస్తోంది. ఈ కమిటీలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా, కలెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. మిగిలిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇందులో సభ్యులుగా ఉంటారు. ముఖ్యంగా భూములను అసైన్డ్ చేసి దాదాపు 20 ఏళ్లు పూర్తి చేసుకున్న వాటికి హక్కులు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. తమ పేరుమీదా ఆ భూమి పట్టా లేకుండా సాగు చేసుకుంటున్న వారికి శుభవార్తే అని చెప్పాలి. ఇక పట్టా పాస్ బుక్ వస్తే రైతు భరోసా, రైతు బీమా వంటి వాటికి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

### భూముల పంపిణీ..

ఈ కొత్త కమిటీలు ప్రభుత్వ మిగులు భూములను గుర్తించి అర్హులైన నిరుపేదలకు కేటాయించే విధానాన్ని పారదర్శకంగా అమలు చేయనున్నాయి. అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం %-%1977 ఉన్నప్పటికీ, చాలా భూములు అనధికారికంగా ఇతరుల చేతుల్లోకి వెళ్లాయి. ఈ సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కమిటీలను రద్దు చేసి ఆ అధికారాలను కలెక్టర్లకు ఇచ్చింది. కానీ ఆశించిన ఫలితాలు రాలేదు. ఇప్పుడు కొత్త కమిటీల ద్వారా ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నారు. తెలంగాణలో దాదాపు 24.25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీటిలో అత్యధికంగా కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఉన్నాయి. పదేళ్ల క్రితం అసైన్డ్ చేసిన భూములపై కూడా యజమాన్య హక్కులు కల్పించే దిశగా ఇతర రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళలో అనుసరిస్తున్న విధానాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

# సెమీకండక్టర్ ప్రాజెక్టుపై తెలంగాణకు కేంద్రం అన్యాయం

అధునాతన వ్యవస్థ, ప్యాకేజింగ్ యూనిట్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపించిందని అన్నారు. అన్ని రకాల అనుమతులు, మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నా తెలంగాణను కాదని కనీసం ఒక్క ఎకరం భూమి కూడా కేటాయించని ఆంధ్రప్రదేశ్‌కు ఈ ప్రాజెక్టును కేటాయించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణలో సెమీకండక్టర్ ప్యాకేజింగ్ యూనిట్ కోసం హైదరాబాద్ శివారు మహేశ్వరంలో 10 ఎకరాల విలువైన భూమిని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కేటాయించిందన్నారు. అన్ని రకాల సబ్సిడీలను, అనుమతులను రికార్డు సమయంలో పూర్తి చేసిందన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన పెట్టుబడికి సంస్థ సిద్ధంగా ఉందని ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) నుంచి అనుమతి కోసం మాత్రమే తెలంగాణ ప్రభుత్వం ఎదురుచూస్తోందన్నారు. తెలంగాణలో సిద్ధంగా ఉన్న భూమి, అనుమతులు, పెట్టుబడిదారుల హామీలు, స్పష్టమైన అమలు ప్రణాళిక ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపిందన్నారు

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక పరిపాలనా లోపం కాదని తెలంగాణ పట్ల కావాలని చూపిస్తున్న సవతి తల్లి ప్రేమ అని ఆయన ఆరోపించారు. సిద్ధంగా ఉన్న మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారుల హామీలు, స్పష్టమైన ప్రణాళిక ఉన్న ఒక రాష్ట్రాన్ని పక్కన పెట్టి కేవలం కాగితాలపై ఉన్న ఒక ప్రతిపాదనకు ప్రాధాన్యత ఇవ్వడం సమంజసం కాదని అన్నారు. ఇలాంటి రాజకీయ ప్రేరేపిత నిర్ణయాలు గ్లోబల్ ఇన్వెస్టర్లకు తప్పుడు సంకేతాలు పంపుతాయని, ఇది తెలంగాణను అవమానించడమేనని అన్నారు. జాతీయ సెమీకండక్టర్ వృద్ధిలో తమకు రావాల్సిన స్థానాన్ని కోల్పోవడానికి తాము సిద్ధంగా లేమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# భారత్-రష్యా మైత్రి

జైశంకర్, లావ్రోవ్ పలు వేదికలపై సమావేశమవుతూనే ఉన్నారు. గత నెలలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా, జూలై 15న జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా కూడా వీరిద్దరూ చర్చలు జరిపారు. పశ్చిమాసియా, బ్రిక్స్, ఎస్‌సీఓ వంటి అంశాలతో పాటు ద్వైపాక్షిక సహకారంపై మంతనాలు జరిపారు.ఈ ఏడాది మార్చి 7న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సైతం మాస్కోలో పర్యటించి రష్యా డిప్యూటీ విదేశాంగ మంత్రితో సంప్రదింపులు జరిపారు. ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని సమీక్షించారు.ఇదిలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించే అవకాశం ఉంది. ఇరు దేశాల నేతల మధ్య వార్షిక సమావేశాల సంప్రదాయాన్ని కొనసాగించేందుకు ఈ పర్యటనకు సన్నాహాలు జరుగుతున్నాయి.

### డా. బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ తేదీ పొడిగింపు

అచ్చంపేట, : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థుల కోసం చివరి తేదీని ఆగస్టు 20 వరకు పొడిగించినట్లు 143 కొండనాగుల స్టడీ సెంటర్ జాక్టో యం. ప్రేమ్ నాయక్ తెలిపారు. ఇంకా డిగ్రీకి నమోదు చేయించని విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు.

## ధారారం గ్రామంలో పాఠశాలకు సెలవు

కల్వకుర్తి, : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని ధారారం గ్రామంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రాథమిక పాఠశాలలకు తాత్కాలికంగా సెలవు ఇవ్వాలని గ్రామ నాయకులు ఉపాధ్యాయులకు వినతి పత్రం అందించారు. వర్షాల తీవ్రత నేపథ్యంలో ఈ విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.

## మాదకద్రవ్య నిర్మూలనపై మానవహారం

నల్లగొండ, : మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం నల్గొండ పాలిటెక్నిక్ కళాశాల ఐటీ హబ్ ఆవరణలో విద్యార్థినీ%-%విద్యార్థులతో మాదకద్రవ్య నిర్మూలనపై మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా అదనపు ఎస్పీ రమేష్ విద్యార్థులందరితో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి, మిషన్ పరివర్తన్ వాలంటీర్లు భరత్, శ్రీకాంత్, పోలీస్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

దేవరకొండ,: నల్గొండ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మారగోని అనితకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో మంజూరైన రూ. 34, 000 విలువ గల సీఎం సహాయ నిధి చెక్కును నల్గొండ మండల మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య బుధవారం నల్గొండ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారురాలి కుటుంబ సభ్యుడికి అందజేశారు. ఈ కార్యక్రమం కొత్తపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పాలడుగు అజయ్, నక్క వినయ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సంగెం, బొల్లేపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిపివేత

భువనగిరి, : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగం భీమలింగం వద్ద ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు మూసినది ఉధృతంగా ప్రవహిస్తుంది. సంగెం, బొల్లెపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉండడంతో భువనగిరి కలెక్టరేట్ కు వెళ్లాలంటే వలిగొండ మీదుగా వెళ్లాలని గ్రామస్తులకు అధికారులు సూచిస్తున్నారు. స్థానికులు రాకపోకలు చేయకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు.

## వంట గ్యాస్ లీక్ కావడంతో ముగ్గురికి గాయాలు

పటాన్‌చెరు, : గుమ్మడిదల మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో రాత్రి సంగీత వంట చేస్తున్న సమయంలో గ్యాస్ లీక్ కావడంతో ఆమె చీరకు నిప్పంటుకుంది. ఆమెకు సహాయం చేస్తుండగా భర్త భూపాల్ కూడా గాయపడ్డాడు. కుమారుడు యశ్వంత్ గ్యాస్ సిలిండర్‌ను బంద్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో సంగీత, భూపాల్, యశ్వంత్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే తూప్రాన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## అధికారులు, సిబ్బంది అందరూ కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలి

నిజామాబాద్, : నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో, అన్ని శాఖల అధికారులు మరియు సిబ్బంది కార్యాలయాల్లో ఉండి ప్రజలకు సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. హాజరుకాని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ తిర్మన్ పల్లి, పాల్దా గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైతు వేదిక వద్ద వ్యవసాయ అధికారిణి లేని విషయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

## షాద్ నగర్ ఎమ్మెల్యేకు న్యాయవాదుల కృతజ్ఞతలు



షాద్‌నగర్, : షాద్ నగర్ న్యాయవాదులు అడిగిన పనికి హామీ ఇచ్చి దానిని వెంటనే నెరవేర్చిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు బుధవారం న్యాయవాదులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. కొన్ని రోజుల క్రితం షాద్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాలరావు కార్యవర్గం సభ్యులు ఎమ్మెల్యే శంకర్ ను కలసి కోర్టులో పలు అభివృద్ధి పనులకు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే సీసీ రోడ్డు వేయడం జరిగింది.

## సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో కార్పొరేటర్

కుత్బుల్లాపూర్, : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం 129వ డివిజన్ విశ్వకర్మ కాలనీలో సీసీ రోడ్లకు సుమారు 49, 50, 000 రూపాయల నిధులు మంజూరు అయ్యాయి. సీసీ రోడ్ పనులను డివిజన్ కార్పొరేటర్ సత్యనారాయణ మరియు విశ్వకర్మ కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధికి ఎప్పుడూ నా సహాయ సహకారాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సదానంద మరియు కాలనీ మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం



ఖానాపూర్,: అన్ని మండలాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు అన్నారు. బుధవారం జన్నారం మండలంలోని తపాలాపూర్ చెక్ పోస్ట్ వద్ద భారీ వాహనాల రాకపోకలను అటవీ శాఖ ఉన్నత అధికారులతో కలిసి ప్రారంభించారు. భారీ వాహనాలను అనుమతించాలని జన్నారం మండల ప్రజలు చాలా కాలంగా కోరుతున్నారని, దానికోసం తాను ప్రభుత్వంతో మాట్లాడి అనుమతులు ఇప్పించడం జరిగిందన్నారు. ప్రజల అభీష్ట మేరకే ప్రజాపాలన చేస్తున్నామని తెలిపారు.

## భారీ వర్షాల పట్ల జాగ్రత్తగా ఉండాలి: సీపీ



రామగుండం, : భారీ వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న 72 గంటల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ కోరారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని, పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. అధికారుల సూచనలను పాటిస్తూ పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్‌కు

# ఘన స్వాగతం



ఖమ్మం, : ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ ను బుధవారం బీజేపీ జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం కారేపల్లి మండలం పేరుపల్లి గ్రామానికి చెందిన వీర జవాన్ బానోత్ అనిల్ కుమార్ అంత్యక్రియల్లో ఆయనతో కలిసి బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

## సాత్నాల ప్రాజెక్ట్ ఒక గేటు ఎత్తివేత

ఆదిలాబాద్, : ఆదిలాబాద్ జిల్లాలోని సాత్నాల మండలంలో బుధవారం భారీ వర్షం కురుస్తోంది. దీంతో సాత్నాల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు అధికారులు ఒక గేటును ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. వాగు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు.

## డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థుల ప్రతిజ్ఞ

బోథ్, : ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ: కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం విద్యార్థులతో మత్తు పానీయాలు, గంజాయి, డ్రగ్స్ వాడకంపై ప్రతిజ్ఞ చేయించారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా, వాటి దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో ఆంటీ డ్రగ్ కోఆర్డినేటర్ డాక్టర్ కోటయ్య, సభ్యులు అనిత పవర్, రేఖ, స్వప్న, ముబారక్ మరియు బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## 'గాజుల పండుగ' కార్యక్రమం వాయిదా

నిర్మల్, : ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లోని వివిధ మండలాల్లో బుధవారం ఇందిరా ఫెలోషిప్, శక్తి అభియాన్ ఆధ్వర్యంలో జరిగే 'గాజుల పండుగ' కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేశామన్నారు. తదుపరి తేదీలను త్వరలో ప్రకటిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఉధృతంగా ప్రవహించే

# వాగులను దాటవద్దు

ముథోల్, : వరద నీటితో ఉధృతంగా ప్రవహించే వాగులను దాటవద్దని పెంబి మండల ఎంపీఓ పి. అనిల్ కుమార్ సూచించారు. భారీ వర్షాలతో పెంబి మండలంలోని పసుపుల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బుధవారం ఆయన ఆ వాగును అధికారులతో కలిసి పరిశీలించారు. రాబోయే రెండు, మూడు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉన్నది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాగు ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే



పరకాల, : వరంగల్ జిల్లా సంగెం మండలం పరకాల నియోజకవర్గం పరిధిలోని కాట్రపల్లి, వెంకటాపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగును బుధవారం అధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అటువైపు వాహనాలు ప్రజలు రాకుండ జాగ్రత్త లు పాటించాలని సూచించారు.

## మంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే

జగిత్యాల, : జగిత్యాల జిల్లా కేంద్రంలో పలు కార్యక్రమాలకు బుధవారం వచ్చిన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ కలిసి మొక్కను అందజేసి స్వాగతం పలికారు. వారి వెంట నాయకులు గిరి నాగభూషణం, వానరాసి తిరుమలయ్య పట్టణ ముఖ్య నాయకులు ఉన్నారు.

## పారువెల్ల-గన్నేరువరం మధ్య

# నిలిచిన రాకపోకలు

మానకొండూరు,: గన్నేరువరం మండలంలో ఉన్న పారువెల్ల గ్రామ ప్రజలు "ఇంకా ఎన్నాళ్లు ఈ కల్వర్టు కష్టాలు?" అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వర్షాకాలంలో, పారువెల్ల నుంచి గన్నేరువరం వెళ్ళే రహదారిలోని లో లెవల్ కల్వర్టుపై వరదనీరు ప్రవహించి రాకపోకలు ఆగిపోతున్నాయి. చెరువు నిండి మత్తడి దూకడంతో పరిస్థితి మరింత బిగుసింది. హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల, : సిరిసిల్ల నియోజకవర్గం తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలో నివసించే గాలిపెల్లి బాలకృష్ణకు సీఎం సహాయ నిధి ద్వారా రూ. 40,000 చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గడ్డం మధుకర్, జాలగం ప్రవీణ్ (టోనీ), శ్యామ్, లక్ష్మీపతి, సదానందం తదితరులు పాల్గొన్నారు. బాలకృష్ణ కుటుంబం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా నేతలకు కృతజ్ఞతలు తెలిపింది.

## రామగుండం బస్సు షెల్టర్

# పరిసరాలు పరిశుభ్రత

రామగుండం, : రామగుండం తాహశీల్దార్ కార్యాలయం సమీపంలోని రాజీవ్ రహదారిపై ఉన్న బస్సు షెల్టర్ ను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చారు. బస్సుషెల్టర్ వద్ద చాలా రోజులుగా బురద పేరుకుపోయిన ప్రయాణికులు అసౌకర్యంగా ఉన్న విషయాన్ని పై ఈ నెల 9న లో వచ్చిన కథనానికి స్పందించి పరిశుభ్రం చేశారు. అధికారులకు, సిబ్బందికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

## జీళ్లచెరువులో ఇళ్లలో నిలిచిన నీటి తొలగింపు

పాలేరు, : కూసుమంచి మండలం జీళ్లచెరువులో ఇళ్లలో నిలిచిపోయిన వరద నీటిని బుధవారం తొలగించారు. పంచాయతీ కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. మందుల బజార్, గౌడ బజార్, చిన్న స్కూల్ ఏరియా, ఎస్సీ కాలనీతో పాటు ప్రధాన రహదారుల పక్కన నిలిచిన నీటిని సిబ్బంది తొలగించారు.

## మధిరలో హర్ ఘర్ తిరంగా అభయాన్ కార్యక్రమం

మధిర, : బీజేపీ పిలుపు మేరకు బుధవారం మధిర పట్టణంలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా అభయాన్ కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ చేశారు. జై కిసాన్, జై జవాన్, భారత్ మాతాకీ జై "మీ తరం మా తరం" వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు సుమంత్, మండల అధ్యక్షుడు శ్రీహరి చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా

సత్తుపల్లి, : పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసానిస్తుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. బుధవారం తల్లాడ మండల పరిధిలోని పలు గ్రామాలలో ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడే పేదల చికిత్స నిమిత్తం ప్రభుత్వం ఆర్థిక సాహయం చేస్తుందని చెప్పారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ధర్నా

మహబూబాబాద్, : వివిధ దేశాల కార్పొరేట్ కంపెనీల మరియు ట్రంప్ వ్యవసాయ వస్తువుల వాణిజ్య సుంకాల ఒప్పందాన్నీ మోడీ ప్రభుత్వం అంగీకరించవద్దంటూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ఎఐకెఎంఎస్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మోడీ డామ్ డాం అంటూ నినాదాలు చేసి నిరసన తెలిపారు.

## చనిపోతూ ఏడుగురిని బతికించాడు

డోర్నకల్,: మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన ఉడుగుల సంతోష్ కళాశాలలో ఆడుతూ ప్రమాదవశాత్తు గాయపడి బ్రెయిన్ డేడ్ అయ్యాడు.
తండ్రి అయిలయ్య సంతోష్ అవయవాలను దానం చేయడానికి ముందుకొచ్చారు. దీంతో వైద్యుడు సంతోష్ అవయవాలను మరో ఏడుగురికి మార్పిడి చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా సంతోష్ చేసిన త్యాగాన్ని స్మరించుకుంటున్నారు.

## జనగామ జిల్లాలో దొంగల బీభత్సం

జనగామ, : జనగామ పట్టణంలోని అమృత బార్ అండ్ రెస్టారెంట్ లో రాత్రి చోరీ జరిగింది. కౌంటర్ లోని 2. 5 లక్షల నగదు అపహరించారని బార్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం కేసు నమోదు చేసిన క్లూస్ టీం సహాయంతో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

## ప్రమాదకరంగా మారిన చెరువు కట్ట

వర్ధన్నపేట, : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం వడ్లకొండ నిండుకుండల మారిన ఊర చెరువుకట్ట ప్రమాదకరంగా మారిందని గ్రామస్తుల సమాచారంతో బుధవారం సంఘటన స్థలానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. ఆర్ నాగరాజు, కలెక్టర్ సత్య శారద చేరుకున్నారు. చెరువు కట్టపై కాలినడకన వెళ్లి ప్రమాదంగా మారిన కట్టను పరిశీలించారు. ప్రమాదంగా మారిన ఊర చెరువు కట్టకు మరమ్మత్తులు చేయాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశించారు.

## డ్రోను రెక్కలు తగిలి

# ఇద్దరికీ గాయాలు



గద్వాల, ఆగస్టు 13(ఎ.ఎం.ఎస్): జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం చంద్రశేఖర్ నగర్‌లో బుధవారం చోటుచేసుకున్న ఘటనలో డ్రోన్ రెక్కలు తగిలి ఇద్దరు గాయపడ్డారు. పుల్లూరు గ్రామానికి చెందిన అలీబాబు, ఓ రైతు మొక్కజొన్న పంటకు మందులు పిచికారీ చేస్తుండగా, ప్రమాదవశాత్తు డ్రోన్ నాగన్న అనే వ్యక్తిని గాయపరిచింది. నాగన్న చేతి రెండు వేళ్ళు తెగగా, అలీబాబుకూ గాయాలయ్యాయి. ఇద్దరినీ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## గ్రావిటీ కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే



దేవరకద్ర, : మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ నుండి గ్రావిటీ ద్వారా గద్దెగూడెం, వెంకటయ్య పల్లిలలో ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా దేవరకద్ర తోపాటు 20 గ్రామాల గొలుసు కట్టు చెరువులకు నీరు వెళ్లే గ్రావిటీ కెనాల్ పనులు పూర్తయిన సందర్భంగా కాలువను పరిశీలించి, అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పైలన్ ఆవిష్కరణకు సంబంధించి స్థానిక నాయకులతో చర్చించారు.ఐ

## మాదకద్రవ్యాల వినియోగంపై

# నిర్మూలనపై అవగాహన ర్యాలీ

వరంగల్ ఈస్ట్, : వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు హనంకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలో బుధవారం మాదకద్రవ్యాల వాడకంపై అవగాహన ర్యాలీ జరిగింది. మడికొండ ఏకశిలా పాఠశాల విద్యార్థులు చౌరస్తాలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ పుల్యాల కిషన్, ఎస్సై రాజకుమార్, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, ఉపాధ్యాయులు, గ్రామ యువత పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణానికి ఇసుక తీస్తే లంచం డిమాండ్

నర్సాపూర్,: ఇందిరమ్మ ఇల్లు కోసం అవసరమైన ఇసుకను తరలించినందుకు తహశీల్దార్ లంచం డిమాండ్ చేశారని బాగీర్తిపల్లికి చెందిన సిద్ధిరాములు ఆరోపించారు. దరిపల్లి శివారులో ట్రాక్టర్ ద్వారా ఇసుకను తీసుకురావడంతో, వెల్దుర్తి పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకుని తహశీల్దార్ బాలలక్ష్మికి అప్పగించారన్నారు. ఇప్పటికే 5 వేల జరిమానా విధించిన తహశీల్దార్, మిగతా విషయాలను పరిష్కరించాలంటే అదనంగా 20 వేలు ఇవ్వాలని కోరారని బాధితుడు పేర్కొన్నారు.

## సంగారెడ్డిలో దంచి కొడుతున్న వానలు

సంగారెడ్డి, : గత మూడు నుండి నాలుగు రోజులుగా కొనసాగుతున్న వర్షాలతో సంగారెడ్డి జిల్లా కేంద్రం తో పాటు వివిధ మండలాల్లోని వార్డుల్లో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై నీరు నిలిచిపోవడం, మట్టికెరిపడడం వంటి సమస్యలతో రాకపోకలు కష్టంగా మారాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారికి పరిస్థితి మరింత కఠినంగా మారింది.

## నర్సాపూర్ నియోజకవర్గం

## బొజ్జా తండాలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం

మెదక్, : శివంపేట మండలం బొజ్జా తండాలో అర్ధరాత్రి తీవ్రమైన అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన రైతు బానోతు లక్ష్మణ్‌కు చెందిన పశువుల పాక, గడ్డి వాము మంటల్లో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో లక్ష్మణ్‌కు చెందిన రెండు పెద్ద పాడి గేదెలు, ఏడు దూడలు మంటల్లో కాలిపోగా, గడ్డి వాము పూర్తిగా దగ్ధమైంది. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. మంటలు ఎగసిపడడంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు.

## రామ్మన్నపేట-లావుడితండల మధ్య

# నిలిచిన రాకపోకలు



మిర్యాలగూడ, : రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి రోడ్లపై వరద ప్రవహిస్తోంది. లావుడితండ-రామన్నపేట మధ్య లోలెవెల్ వంతెనపై వరద ఉధృతి కొనసాగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, రైతులు ఇబ్బందులు పడ్డారు. నల్గొండ జిల్లాలో సెలవులు ప్రకటించకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సమస్యలు ఎదుర్కొన్నారు. ఈ వంతెనపై బ్రిడ్జి నిర్మించాలని దశరథ నాయక్ కోరారు.

## భారతీయ సంస్కృతికి,భక్తి సంప్రదాయాలకు

# కృష్ణాష్టమి ప్రతీక

- వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ : గడీల ప్రసాద్
- సాంస్కృతిక కార్యక్రమాలే సమగ్ర విద్యకు పునాది
- ప్రధానోపాధ్యాయులు : సృజన
- వివేకానంద హైస్కూల్లో ఘనంగా ముందస్తు "కృష్ణాష్టమి వేడుకలు"
- పాఠశాల ప్రాంగణమంతా శ్రీకృష్ణలీలామయం
- ఆకట్టుకున్న చిన్నారుల గోపికా, కృష్ణుల వేషధారణలు





**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలోని పాత మార్కెట్ ఏరియాలో గల వివేకానంద హై స్కూల్లో బుధవారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం పూలతో,రంగోలి అలంకరణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకొని, శ్రీకృష్ణ లీలామయంగా మారింది. చిన్నారులు గోపికలు,కృష్ణుల వేషధారణలతో రకరకాల సాంప్రదాయ ఆభరణాలు,పూలతో అందంగా ముస్తాబైన తీరుతో అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు ఆలపించిన కృష్ణ భజనలు,నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి. తరువాత ఉట్టి కొట్టే కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు జట్టుగా ఎక్కి ఉట్టిని కొట్టడానికి ప్రయత్నించగా,చప్పట్లతో, హర్షధ్వనులతో వేదిక మారుమ్రోగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గడీల ప్రసాద్ మాట్లాడుతూ, "కృష్ణాష్టమి పర్వదినం మన భారతీయ సంస్కృతి,భక్తి సంప్రదాయాలకు ప్రతీక. ఈ విధమైన వేడుకల ద్వారా చిన్నారులకు మానవీయ విలువలు,సత్సంకల్పాలు, సాంప్రదాయాలపై అవగాహన కలుగుతుంది. పాఠశాల విద్య అంటే కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, జీవన విలువలను నేర్పించడంలోనూ ముందుండాలి" అన్నారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సృజన మాట్లాడుతూ, "చిన్నారుల వేషధారణ,వారి నటన, ఉత్సాహం అందరినీ ఆకట్టుకుంది. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాక, వారిలో దాగిఉన్న సృజనాత్మకతకు వేదిక కల్పిస్తాయి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,స్థానిక ప్రముఖులు పాల్గొని పిల్లలను ప్రోత్సహించారు.

## ఎన్నికల హామీ అమలులో
# సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం

- పేదల సొంతఇంటి కల నెరవేరుస్తున్న " ఇందిరమ్మ పథకం"
- కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ళు
- ప్రభుత్వ విప్: ఆది శ్రీనివాస్
- సుభాష్‌నగర్‌లో లబ్ధిదారులకు చీర-సారె బహూకరణ



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణం సుభాష్‌నగర్‌లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గడప పూజ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి,లబ్ధిదారుల సమస్యలు,అవసరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబాలకు చీర – సారెను అందజేశారు.

### "హామీ ఇచ్చాం.. నేడు నిలబెట్టాం"

ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. వేములవాడ నియోజకవర్గంలో అనేక ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇప్పటికే బేస్‌మెంట్ పూర్తి కాగా పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని గూడు లేని పేదలు గౌరవంగా జీవించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టింది. గత ప్రభుత్వం పది సంవత్సరాలపాటు ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా కట్టలేదు. ఇప్పుడు ఎన్నికల్లో చెప్పినట్లుగానే ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు నిర్మిస్తున్నారు" అన్నారు.ఎన్నికలలో ఇచ్చిన మాటను గుర్తు చేస్తూ "మీ ఇంటి గడప పూజకు వస్తానని, చీర సారె ఇస్తానని మాటిచ్చాను. నేడు ఆ మాట నిలబెడుతున్నాను" అని ఆది తెలిపారు.

### లబ్ధిదారుల ఆనందం

ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ "గతంలో ఇందిరమ్మ కాలంలో ఇళ్లు మంజూరయ్యాయి. కానీ పదేళ్లపాటు గత ప్రభుత్వం ఇళ్లు ఇవ్వలేదు. మళ్లీ ప్రజా ప్రభుత్వంలో, సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో, విప్ ఆది శ్రీనివాస్ కృషితో నేడు ఇళ్లు మంజూరయ్యాయి. బేస్‌మెంట్ పూర్తయిన ఇళ్లకు రూ.1 లక్ష బిల్లు వచ్చింది. సొంత ఇల్లు కల నెరవేరుతుందనే సంతోషం కలుగుతోంది" అని సీఎం రేవంత్ రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో
# 85% ఫీజు రాయితీ తో ఆన్లైన్ శిక్షణ



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** భారతదేశపు స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కరించుకొని 100 కు పైగా కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో 85% ఫీజు రాయితీ తో ఆన్ లైన్ ద్వారా శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ డైరెక్టర్ వెంకట రెడ్డి తెలిపారు. ఈ ప్రోగ్రామ్ ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమా, పీజీ కోర్సులు చదువుతున్న, పూర్తి చేసిన విద్యార్థులకు సరికొత్త కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలలో వారి నైపుణ్యాలను పెంచుకోవడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. మెరుగైన ఉద్యోగాల కోసం దేశ విదేశాలలో కంప్యూటర్ సాఫ్ట్వేర్ రంగంలో రాణించేందుకు ప్రతి ఒక్క విద్యార్థి నేర్చుకోవాల్సిన 100 కి పైగా అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కోర్సుల నుండి ఏ కోర్సు అయినా ఎంపిక చేసుకోవచ్చు. డిప్లొమా ఇన్ సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్, పీజీ డిప్లొమా ఇన్ సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్, మాస్టర్ ప్రోగ్రాం ఇన్ సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్ తో పాటు 100 కి పైగా లేటెస్ట్ సాఫ్ట్వేర్ సర్టిఫికేషన్ కోర్సులు వీటిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పైథాన్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, బిజినెస్ అనలిటిక్స్ , దేవోప్స్ ఇంజనీరింగ్ , ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బ్లాక్‌చెయిన్, డీప్ లెర్నింగ్,సెలీనియం, సేల్స్‌ఫోర్స్, జావా, ఒరాకిల్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇంజినీరింగ్, ఆర్ ప్రోగ్రామింగ్, డీప్ లెర్నింగ్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ సొల్యూషన్ ఆర్కిటెక్ట్, పవర్–బిఐ , గేమ్ డెవలపింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, బిజినెస్ ఇంటెలిజెన్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బ్లాక్ చైన్, డీప్ లెర్నింగ్, సెలీనియం, సేల్స్‌ఫోర్స్, జావా ప్రోగ్రామింగ్, ఒరాకిల్, మినిటాబ్, లైనక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ , ఎజైల్, నెట్వర్క్ సెక్యూరిటీ , సెలీనియం, సాస్ ప్రోగ్రామింగ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, వెబ్ డిజైన్, సోషల్ మీడియా మార్కెంగ్, డిజిటల్ మార్కెటింగ్ లాంటి 100 కి పైగా అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కోర్సులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ–లెర్నింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో శిక్షణ అందించబడుతుందన్నారు. తర్వాత పరీక్షలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. విజయవంతమైన అభ్యర్థులు భారత ప్రభుత్వం ఆమోదించిన సర్టిఫికేట్‌ను అందుకుంటారు. కోర్సు వ్యవధి 2 నెలల నుండి 10 నెలలు వరకు ఉంటుంది, వివిధ సాఫ్ట్వేర్ సబ్జెక్ట్‌లో ఇన్ డెప్త్ నాల్డెజ్ పొందేందుకు ఇది చక్కటి అవకాశంగా నిలుస్తోంది. ఈ ప్రోగ్రామ్ యొక్క ప్రత్యేకత ఏంటంటే వెనకబడిన వర్గాల వారికి ఫీజులో రాయితీ లభిస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కమ్యూనిటీలకు చెందిన వ్యక్తులు, వికలాంగులు, మహిళా అభ్యర్థులు మాజీ సైనికులు మరియు వారి పిల్లలు స్వర్ణ భారత్ జాతీయ స్థాయి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ద్వారా 85% ఫీజు తగ్గింపునకు అర్హులు.ఇంటర్ ,డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమా, పీజీ కోర్సులు చదువుతున్న%ం% పూర్తి చేసిన ఆసక్తి గల అభ్యర్థులుwww.nationalskillacademy.in వెబ్ సైట్ లో ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9505800050, 9505800047 ఫోన్ నంబర్‌లపై సంప్రదించాలని కోరారు.ం

## రాజన్న అనుబంధ ఆలయాలను క్షేత్రస్థాయిలో సందర్శించిన ఆలయ ఈఓ



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న ఆలయాల నిర్వహణ, సదుపాయాలపై దేవస్థానం ఈఓ రాధాబాయి బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించి, సమీక్షించారు.ముందుగా శ్రీ బద్దీ పోచమ్మ ఆలయం, శ్రీ భీమేశ్వరాలయం, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయాలను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాల డీసీఆర్ (దినచర్య రిజిస్టర్లు) పరిశీలించి, పనితీరుపై అధికారులతో చర్చించారు.ఆలయాల పరిసరాలను స్వయంగా పరిశీలించిన ఈఓ, పరిశుభ్రత, భక్తులకు తాగునీరు, కూర్చునే సదుపాయాలు వంటి ప్రాథమిక వసతులపై సమీక్ష నిర్వహించారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, మర్యాదపూర్వకంగా సేవలందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని ఆమె స్పష్టం చేశారు.ఈ సందర్భనలో అనుబంధ ఆలయాల పర్యవేక్షకులు పూడెపు వెంకట ప్రసాద్, ఆలయ ఇన్స్పెక్టర్ శ్యామ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీపై రాహుల్ గాంధీ అసత్య ఆరోపణలు సరికావు

- గౌడ సంఘం జాతీయ అధ్యక్షులు శివ నాగేశ్వరరావు గౌడ్



**గూడూరు (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారత ఎన్నికల కమిషన్ పై అసత్య ఆరోపణలు చేయడం సరి కావని గౌడ్ సంఘం జాతీయ అధ్యక్షులు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ సెక్రెటరీ శివ నాగేశ్వరరావు గౌడ్ పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో గౌడ సంఘం జాతీయ అధ్యక్షులు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ సెక్రెటరీ శివ నాగేశ్వరరావు గౌడ్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా నిస్వార్ధంగా ప్రభుత్వ పాలన చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీపై, నిష్పక్షపాతంగా రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు నిర్వహించిన రాజ్యాంగ సంస్థ అయిన భారత ఎన్నికల కమిషన్ పై కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ అసత్య ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని వెల్లడించారు. ప్రపంచ దేశంలోనే భారతదేశాన్ని నెంబర్ వన్ స్థానానికి తీసుకువెళ్లేందుకు మోడీ ఎంతో శ్రమిస్తున్నారని ప్రపంచ దేశాలే ఆయనకు ఎంతో గౌరవం ఇస్తున్నారని వెల్లడించారు .కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల విభజన సమయంలో ఆంధ్ర రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి అధోగతి చేశారని విమర్శించారు. ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలనలో ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి , ప్రత్యేక ప్రాజెక్టులు రైల్వే బోర్డులు అభివృద్ధికి నిధులు ఎంతో మంజూరు చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నారు అన్నారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మిరియాల వెంకటరామయ్య చిట్టెం ,శ్రీనివాసులు గౌడ్ , ఉదయగిరి మోహన్ గౌడ్, శ్రీరామ్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ భాస్కర్ ను సన్మానించిన కాలనీ సంక్షేమ సంఘం నాయకులు



**ఉప్పల్(ప్రశ్న న్యూస్)** ఉప్పల్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్ ను ఉప్పల్ అసెంబ్లీ బిజెపి అధికార ప్రతినిధి ఇలీటం నర్సింహ రెడ్డీ, తెలంగాణ రాష్ట్ర టూర్స్ %ం% ట్రావెల్ బస్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, హైకోర్టు న్యాయవాది పి. కృష్ణయ్య శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇలీటం నరసింహారెడ్డి మాట్లాడుతూ బాలకృష్ణ నగర్ కాలనీ, సాయి కృష్ణ నగర్ కాలనీ, సత్య నగర్ కాలనీ లో పోలీసుల గస్తీని పెంచాలని, సాయంత్రం వేళలో ఉప్పల్ భగవత్, రామ్ రెడ్డి నగర్ నుండి నాగోల్ మెట్రో స్టేషన్ కు వెళ్లే రోడ్డు మార్గంలో యువకులు రోడ్లపైనే మద్యం, గంజాయి, సేవిస్తున్నారని అలాంటి వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

## దోమల నివారణ కోసం తిమ్మాపాస్ కెమికల్స్ స్ప్రే

కూకట్‌పల్లి, : కూకట్ పల్లి నియోజకవర్గం కూకట్ పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో కూకట్పల్లి డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో వర్షాకాల నేపథ్యంలో నివారణలో భాగంగా ఎంటమాలాజీ ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు , సిబ్బందితో కలిసి తులసి నగర్ కాలనీలోని నీరు నిల్వ ఉన్న చోట దోమలు గుడ్లు పెట్టి దోమ పిల్లలు ఉత్పత్తి చేసే ఆస్కారం ఉంది. కాబట్టి వెంటనే దోమల నివారణ కోసం తిమ్మాపాస్ కెమికల్స్ పిచికారి చేయడం జరిగింది.

## యూరియా కోసం రైతుల ధర్నా

సిద్దిపేట, : చిన్నకోడూరు మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట యూరియా లభ్యత లేక రైతులు ధర్నాకు దిగారు. ప్రభుత్వం తక్షణం సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెరాస నాయకుడు వేలేటి రాధాకృష్ణశర్మ మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో ఎరువుల కొరత ఎప్పుడూ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

## స్కూల్ విద్యార్థులకు తప్పిన ప్రమాదం

నాగర్‌కర్నూల్, : నాగర్ కర్నూల్ మండలంలోని గన్యావుల గ్రామ శివారులో ఉన్న పెద్దకొత్తపల్లి ఆల్ సెంట్స్ మోడల్ స్కూల్ బస్సు, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదాన్ని గమనించిన వరి నాట్లు వేస్తున్న కూలీలు విద్యార్థులను రక్షించారు. 20 మంది విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గ్రామస్థులు, స్కూల్ సిబ్బంది వారిని ఇళ్లకు పంపించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జడ్చర్ల, : గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలకు పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాలలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సరస్వతి సూచించారు. మట్టి మిద్దెలో ఉండరాదని, విద్యుత్ స్తంభాలను ముట్టరాదని అన్నారు. రైతులు వ్యవసాయ పొలంలో బోరు బావుల దగ్గర జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఇంటిలోని విద్యుత్ బోర్డులను, స్విచ్లను వేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

## రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్న భారీ వర్షాలు

ఆలంపూర్, : గత ఐదు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి వర్షాల వల్ల వాగులు, వంకల సమీపంలోని పొలాలు నీటమునిగి, వేలాది ఎకరాల్లో పంట నష్టపోయింది. ముఖ్యంగా పత్తి, మిరప, కంది, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టాలను అధికారులు పరిశీలించి, సరైన పరిహారం కల్పించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## లక్ష్మాపూర్ తండాలో మొదలైన
# తీజ్ పండుగ ఉత్సవాలు

నాగర్‌కర్నూల్, : అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ తండాలో బుధవారం తీజ్ పండుగ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పండుగ కోసం మొలకలను నానబెట్టడానికి బిందెలతో నీటిని తీసుకు రావడం వైభవంగా నిర్వహించారు. తీజ్ పండుగను ఈ నెల 20న ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ పండుగ నిర్వహించుకోవడం వల్ల మా కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా మహిళలు, గ్రామ పెద్దలు, డాక్టర్ బీక్కు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్ మహమ్మారిని నిర్మూలిద్దాం

## భావితరాలకు మంచి భవిష్యత్తుని అందిద్దాం: ఎస్పీ మహేష్ బి. గీతే

### జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటుగా విద్యాసంస్థలలో మాధకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) మాధకద్రవ్యాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నాషా ముక్త్ భారత్ అభియాన్ ఐదు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం మేరకు జిల్లాలో విద్యాసంస్థల్లో మాధకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. జిల్లా పోలీస్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన మాధకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమంలో అధికారులు, సిబ్బందితో కలసి పాల్గొన్న ఎస్పీ. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేను మాధకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఎవ్వరూ డ్రగ్స్ భారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు అందిస్తానని, డ్రగ్స్ రహిత సమాజాన్ని లక్ష్యంగా పెట్టుకున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేపించడం జరిగిందన్నారు. డ్రగ్స్ నిర్మూలనకోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై డ్రగ్స్ మహమ్మరిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి,యువత యాంటీ డ్రగ్ సోల్జర్ గా మారి మాధకద్రవ్యాల వలన కలుగు అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాలు సమూలంగా నిర్మూలించటలో యువత,ప్రజలు పోలీసువారికి సహకరించుటలో కీలక పాత్ర పోషించాలని కోరారు.జిల్లాలో అక్రమంగా గంజాయి సేవించిన, క్రయవిక్రయాలు జరిపిన,కఠిన చర్యలు తప్పవని ఈసందర్భంగా హెచ్చరించారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ లు, నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ గంజాయి రవాణాపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపుతున్నారని తెలిపారు.జిల్లాలో ఈసంవత్సరం 40 కేసులల్లో 98 మందిని అరెస్ట్ చేసిన 3.700 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గంజాయికి సంబంధించిన సమాచారం సబంధిత పోలీస్ వారికి సమాచారం అందించి గంజాయి రహిత జిల్లాగా మర్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి పద్మ, సి.ఐ లు నటేష్, రవి, ఆర్.ఐ లు రమేష్, మధుకర్, యాదగిరి, ఎస్.ఐ లు శ్రీకాంత్, ప్రేమానందం, జునైద్, శ్రవణ్, శ్రీనివాస్, రమేష్, పోలీస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ముంపు ప్రాంత సమస్యలను తీరుస్తాం

### బోర్డు సీఈవో మధుకర్ నాయక్



సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్) ఆరో వార్డు లో ని వరద ముంపు ప్రాంతాల్లో కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ బుధవారం పర్యటించారు. మొదట మర్రి రామిరెడ్డి కాలనీలో పర్యటించిన సీఈవో కు స్థానిక కాలనీవాసులు మాల్యాద్రి,వైద్య నాథం,ఈశ్వర్,కృష్ణ తదితరులు ముంపు సమస్యను వివరించారు. కాలనీలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ కాలనీ వాసులకు సరిపోతుందని, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటితో నే తమ కాలనీకి ముంపు సమస్య తలెత్తుతోందని కాలనీవాసులు సీఈఓ కు వివరించారు. తమ కాలనీకి చెందిన ఓపెన్ నాలా, వరద నీటి డ్రైనేజీ కనెక్షన్ల ను సౌజన్య కాలనీ మీదుగా ఓపెన్ నాలా కు అనుసంధానం చేస్తే సమస్య కొంతమేరకు పరిష్కారం అవుతుందని సీఈఓ కు తెలిపారు. అలాగే హర్షవర్ధన్ కాలనీ నుంచి తమ కాలనీకి మధ్యలో ఉన్న ప్రైవేట్ ల్యాండ్ వద్ద గోడను ఏర్పాటు చేసుకుంటామని దీనికి బోర్డు అనుమతిస్తే బాగుంటుందని కాలనీవాసులు కోరారు.

ముంపు సమస్య శాశ్వత పరిష్కారం అయ్యేలోగా, ప్రస్తుతానికి గోడ నిర్మాణం పనులను బోర్డు అనుమతితో చేసుకోవచ్చని సీఈవో వారికి తెలిపారు. అనంతరం సీఈవో సీతారాంపురం బస్తీ లో పర్యటించారు. డైరీ ఫాం, ఓల్డ్ బోయిన్ పల్లి ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటితో తమ బస్తీకి ముంపు సమస్య ఏర్పడుతోందని బస్తీ వాసులు సీఈఓ కి తెలిపారు. అటు మర్రి రాం రెడ్డి కాలనీ, ఇటు సీతారాంపురం ప్రాంతాల్లో వరద ముంపు నివారణకు ఎస్ ఎన్ డి పి నిధులను ఉపయోగించి ముంపు సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని సీఈవో హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చెన్న కేశవులు,నాగేశ్వర్ రావు,కృష్ణ యాదవ్ తో పాటు సీతారాంపురం కాలనీ వాసులు సాయి బాబా యాదవ్,ప్రకాష్,విజయ్ బాబు, మనోహర్,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సుభాష్‌నగర్‌లో ఘనంగా

# ఇందిరమ్మ ఇళ్ల గడప పూజా

- ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్
- లబ్ధిదారులకు చీర - సారెలు అందజేత




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలోని సుభాష్‌నగర్‌లో పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా బుధవారం గడప పూజా వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం లబ్ధిదారుల ఆనందానికి తోడుగా చీర - సారెలను అందజేసి, వారితో సంతోషాన్ని పంచుకున్నారు.గత కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న సొంత ఇంటి కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందిస్తున్న సహకారానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## వేములవాడ పట్టణంలో

## వివాహ వేడుకలకు కేటీఆర్, చల్మెడ హాజరు

- నూతన వధూవరులకు శుభాకాంక్షలు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలో బుధవారం జరిగిన పలు వివాహ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.వేములవాడ రూరల్ మండల మాజీ జడ్పీటీసీ ఏస వాణి%-%తిరుపతి కుమార్తె వివాహం పట్టణంలోని పద్మావతి ఫంక్షన్ హాల్లో, చందుర్తి మండల సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ కుమార్తె వివాహం మహారాజ ఫంక్షన్ హాల్లో,బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామ మాజీ సర్పంచ్ రంగి రేణుక%-%తిరుపతి కుమారుని వివాహం రిషి గార్డెన్స్‌లో జరిగింది.ఈ కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, మాజీ జిల్లా జడ్పీ చైర్పర్సన్లు తుల ఉమ, న్యాలకొండ అరుణ%-%రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, ప్యాక్స్ చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ కౌన్సిలర్లు, సెస్ డైరెక్టర్లు, అర్బన్, రూరల్, చందుర్తి, కోనరావుపేట మండల అధ్యక్షులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వ్యసనానికి దూరంగా

# ఉండాలని విద్యార్థులకు పిలుపు



**సిరిసిల్ల / వేములవాడ (ప్రశ్న న్యూస్)** సిరిసిల్ల, అగ్రహారంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. నార్కోటిక్స్ విభాగం, కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు, కళాశాల యాంటీ డ్రగ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.వేములవాడ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే శారీరక, మానసిక నష్టాలపై అవగాహన కల్పించారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శంకర్ మాట్లాడుతూ, “మాదకద్రవ్యాల వాడకం యువత భవిష్యత్తును చీకట్లోకి నెడుతుంది, వాటి నుండి దూరంగా ఉండాలి” అని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య, కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ కే.వై. కరుణ, ఎక్సైజ్ ఎస్సై వి. రవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి స్కూల్లో వైభవంగా

## ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ – సరస్వతి బ్లాక్లో బుధవారం ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సన్నిధి వెంకటకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు శ్రీకృష్ణుడి జన్మ వృత్తాంతం,ఆయన బాల్య లీలలు,జన్మాష్టమి పర్వదిన విశిష్టతలను వివరిస్తూ స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు.పిల్లలు చిన్న శ్రీకృష్ణులు, గోపికల వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రదర్శనలు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను,ప్రిన్సిపాళ్ళను,అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని, వేడుకను విజయవంతం చేశారు

## మాదకద్రవ్యాలు ఆరోగ్యం తోపాటుగా కుటుంబ సుఖశాంతులను నాశనం చేస్తాయి

- విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ : అంజయ్య
- నషా ముక్త్ భారత్‌లో భాగంగా విద్యార్థుల చేత మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ రూరల్ మండలం, నూకలమర్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం “నషా ముక్త్ భారత్ అభియాన్” కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా వేములవాడ రూరల్ ఎస్ఐ అంజయ్య మాట్లాడుతూ, “విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాల హానికర ప్రభావాలపై అవగాహన కలిగి ఉండాలి. మాదకద్రవ్యాలు వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, కుటుంబ సుఖశాంతిని కూడా నాశనం చేస్తాయి. వాటికి దూరంగా ఉండటం ద్వారా మాత్రమే మంచి భవిష్యత్తు సాధ్యం” అని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కిషన్, ప్రధానోపాధ్యాయులు సదానందం, ఏఎస్ఐ రవీందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బాపురెడ్డి,కానిస్టేబుల్ రాజశేఖర్,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.


## సంగిశెట్టి రవీంద్ర సాగర్ కూతురు పెళ్లి వేడుక హాజరైన ప్రముఖులు



కీసర(ప్రశ్న న్యూస్) మేడ్చల్ పార్లమెంట్ నియోజకవర్గ బిజెపి కౌన్సిల్ మెంబర్ సంగిశెట్టి రవీందర్ సాగర్ కూతురు పెళ్లికి హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి. ఉప్పల్ నియోజకవర్గంలో నివసించే ప్రతి కుటుంబంకు సంబందించిన పెళ్లిళ్లు పేరంటాలకు ఎలాంటి కార్యక్రమమైనా నేను హాజరవుతానని పేద, ధనికులు అని చూడనని ఆయన తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో ప్రతి నాయకుని ప్రతి కార్యకర్తకు ప్రతి వ్యక్తికి సంబంధించిన ప్రతి కార్యక్రమానికి హాజరవుతానని ఆయన అన్నారు. సంగిశెట్టి రవీందర్ సాగర్ కూతురు అఖిల సాగర్, అల్లుడు ప్రదీప్ సాగర్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంకు ఉప్పల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు కార్యకర్తలు, స్నేహితులు, బంధువులు, మీడియా మిత్రులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## జాతీయ అవార్డు పొందిన డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్

**గూడూరు (ప్రశ్న న్యూస్)** నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ(ఎన్ డి.సి.ఏ) వారు గూడూరుకు చెందిన ప్రముఖ సామాజిక వేత్త శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్ )కు జాతీయ అవార్డు-2025 ఇవ్వడం జరిగింది. మయూరి శ్యామ్ యాదవ్ అనేక సామాజిక సేవ కార్యక్రమంలు చేయడంతో అది గుర్తించిన ఎన్.డి.సి.ఏ ఈ అవార్డు ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ జాతీయ స్థాయిలో అవార్డు దక్కినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవార్డు ఇచ్చిన ఎన్. డి.సి.ఏ నేషనల్ డైరెక్టర్ డాక్టర్ బింగి నరేంద్ర గౌడ్ గారికి మయూరి శ్యామ్ యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపేను,మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ నేను చేయు సేవా కార్యక్రమాలకు ఆ దేవ దేవుడు శ్రీ కృష్ణ పరమాత్ముడు ఆశీస్సులు నా తల్లదండ్రులు వనమ్మ ,కృష్ణయ్య దీవెనలతో పాటు మయూరి స్వీట్స్ మరియు వనజాకృష్ణ కళ్యాణ మంటపం సహాయ సహకారాలతో నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.



# సౌత్ క్యారెక్టర్లే గొప్ప..



సౌత్‌లో కొన్ని సినిమాలు చేసి బాలీవుడ్‌కు వెళ్లే హీరోయిన్లందరూ.. ఇక్కడి సినిమాలను తక్కువ చేసి మాట్లాడ్డం ఎన్నో సందర్భాల్లో జరిగింది. చాలామంది ఇక్కడి సినిమాలను డీగ్రేడ్ చేసిన వాళ్లే. కెరీర్ బాగున్నంత కాలం తమ వద్దకు వచ్చే గ్లామర్ పాత్రలకు ఓకే చెప్పి సినిమాల్లో నటిస్తారు. కానీ ఇక్కడ డౌన్ అయి అక్కడ కొన్ని మంచి పాత్రలు పడగానే.. సౌత్ వాళ్లు తమ టాలెంట్‌ను గుర్తించలేదని.. గ్లామర్ డాల్ లాగా చూశారని.. సరైన పాత్రలు ఇవ్వలేదని బురదజల్లే ప్రయత్నం చేస్తారు. ఐతే పూజా హెగ్డే మాత్రం దీనికి భిన్నంగా మాట్లాడి ఆశ్చర్యపరిచింది. ఆమె స్వతహాగా బాలీవుడ్ హీరోయినే. కానీ తెలుగు, తమిళంలోనే మంచి పాత్రలు పడ్డాయి.హిట్లు కూడా ఇక్కడే వచ్చాయి. ఐతే ఈ మధ్య తెలుగులో ఆమెకు ఛాన్సులు తగ్గాయి. తమిళంలో కొంచెం బిజీ అయింది. హిందీలో కూడా అవకాశాలకు లోటు లేదు. ఐతే ఒక ఇంటర్వ్యూలో పూజా మాట్లాడుతూ.. బాలీవుడ్ తనకు సరైన పాత్రలు ఇవ్వలేదని వాపోయింది. అక్కడి వాళ్లు తనను గ్లామర్ హీరోయిన్ లాగే చూశారని.. పెద్దగా గుర్తింపు లేని పాత్రలే ఇచ్చారని వ్యాఖ్యానించింది. కానీ సౌత్ సినిమాల్లో మాత్రం తనకు మంచి మంచి క్యారెక్టర్లు దొరికాయని ఆమె చెప్పింది. చివరగా తాను నటించిన 'రెట్రో' సినిమాలో కార్తీక్ సుబ్బరాజ్ అద్భుతమైన పాత్ర డిజైన్ చేశాడని.. తాను ఎలా పెర్ఫామ్ చేయగలనో ఆ సినిమా చూపించిందని ఆమె చెప్పింది. ఇలాంటి పాత్రలు మరిన్ని చేయాలని ఉందని పూజా పేర్కొంది. తెలుగులో కూడా పూజా అరవింద సమేత, రాధేశ్యామ్ లాంటి చిత్రాల్లో నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలే చేసింది. బాలీవుడ్లో మాత్రం 'మొహెంజదారో'లో మినహాయిస్తే దాదాపుగా అన్నీ గ్లామర్ క్యారెక్టర్లే చేసింది పూజా.

# రిలీజ్‌కు ముందే వంద కోట్లు



ఒకప్పుడు సౌత్ ఇండియాలో రజినీకాంత్‌ను మించిన స్టార్ లేదు అన్నట్లుండేది పరిస్థితి. ఆయన సినిమాల బడ్జెట్లు, బిజినెస్‌లు, వసూళ్లు అన్నీ కూడా వేరే లెవెల్లో ఉండేవి. వంద కోట్ల వసూళు వస్తే అద్భుతం అనుకునే రోజుల్లోనే 'రోబో' మూవీతో వందల కోట్ల వసూళ్లు తెచ్చిపెట్టిన ఘనత ఆయన సొంతం. ఐతే గత కొన్నేళ్లలో రజినీ నటించిన పలు చిత్రాలు తీవ్రంగా నిరాశపరిచాయి. 'జైలర్'ను మినహాయిస్తే అన్నీ ఫెయిల్యూర్లే. పేట, పెద్దన్న, వేట్టయాన్ లాంటి చిత్రాలకు అయితే అసలు హైపే లేదు. 'జైలర్' కూడా రిలీజ్ తర్వాతే పుంజుకుంది. కానీ సూపర్ స్టార్ కొత్త చిత్రం 'కూలీ' సంగతి మాత్రం వేరు. ఈ సినిమా మొదలైన దగ్గర్నుంచే మంచి హైప్ తెచ్చుకుంది. రిలీజ్ టైంకి ఆ హైప్ మల్టిప్లై అయింది. గత కొన్నేళ్లలో ఇంత హైప్ తెచ్చుకున్న సినిమా ఇంకోటి లేదు అనే పరిస్థితి కనిపిస్తోంది. 'కూలీ'కి అడ్వాన్స్ బుకింగ్స్ అలా జరుగుతున్నాయి మరి. 'కూలీ' ఫస్ట్ షో పడడానికి ముందే వసూళ్లు రూ.100 కోట్లను టచ్ చేసేలా కనిపిస్తుండడం విశేషం. ఇప్పటికే వరల్డ్ వైడ్ అడ్వాన్స్ బుకింగ్స్‌తో ఈ చిత్రం రూ.70 కోట్ల దాకా రాబట్టింది. సినిమా రిలీజ్ కావడానికి ఇంకా ఒక రోజు పైన సమయం ఉంది కాబట్టి.. ఆలోపు బుకింగ్స్‌తో రూ.100 కోట్ల మార్కును టచ్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

## కాంతార కష్టాల వెనుక

# అసలు కథ




కేవలం పదహారు కోట్లతో తీసిన ఒక మీడియం బడ్జెట్ సినిమా ఏకంగా నాలుగు వందల కోట్లు వసూలు చేస్తుందని ఎవరు ఊహిస్తారు. కానీ కాంతార సాధ్యం చేసి చూపించింది. అందుకే దాని ప్రీక్వెల్ కాంతార చాప్టర్ 1 మీద విపరీతమైన అంచనాలు ఏర్పడ్డాయి. హెూంబాలే ఫిలిమ్స్ ఈసారి బడ్జెట్ ని కూడా అమాంతం పెంచేసింది. అయితే ఈ మూవీ ప్రారంభ దశ నుంచే విపరీతమైన అవాంతరాలు, ప్రమాదాలు ఎదురుకుంది. ఇదంతా దేవుడి శాపమని, ఆపమనే దానికి సూచనని రకరకాల ప్రచారం జరిగింది. దీనికి నిర్మాతల్లో ఒకరైన చలువే గౌడ స్పందిస్తూ కాంతార కష్టాల వెనుక అసలు కథ చెప్పారు. కాంతార స్టార్ట్ చేసినప్పటి నుంచి సినిమాకు సంబంధించి జరిగింది తక్కువ ప్రమాదాలే. నవంబర్ 2024 కొల్లూరు సెట్ లో జరిగిన అగ్ని ప్రమాదం వల్ల కొందరు యూనిట్ సభ్యులు గాయపడ్డారు. తర్వాత జనవరి 2025లో మరొక సెట్ లో ఫైర్ యాక్సిడెంట్ అయినప్పటికీ ఎవరికీ గాయాలు, ప్రాణ నష్టం జరగలేదు. కొన్ని నెలల క్రితం హీరో కం దర్శకుడు రిషబ్ శెట్టి పడవ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కెమెరా లాంటి పరికరాలు నీటిలో మునిగిపోయాయి తప్పించి ఎవరికి ఏం కాలేదు. కాంతార చాప్టర్ 1 మొదలుపెట్టడానికి ముందే గ్రామదేవత పంజుర్లీని అడిగితే కొన్ని అవాంతరాలు వచ్చినా నిర్విఘ్నంగా పూర్తి చేస్తారని చెప్పింది. దీంతో చిత్ర బృందం చిత్రీకరణ మొదలుపెట్టి దిగ్విజయంగా విడుదలకు రెడీ చేస్తోంది. మధ్యలో జరిగిన కొన్ని ప్రమాదాలు, మరణాలు షూట్ కి ఏ మాత్రం సంబంధం లేనివి. రోజు ఉదయం 6 గంటలకు మొదలయ్యే షూటింగ్ ఏకధాటిగా జరిగేది. దాని కోసం ఉదయం నాలుగు గంటలకే టీమ్ మొత్తం లేవాల్సి వచ్చింది. ఎనభై శాతానికి పైగా రియల్ లొకేషన్లలోనే కాంతార తీశారు. అక్టోబర్ 2 రిలీజ్ కాబోతున్న కాంతార చాప్టర్ 1 కు భారీ బిజినెస్ ఆఫర్స్ ఉన్నాయి. ఇంకా ఎవరిని ఫైనల్ చేయలేదు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన హక్కులకు కనివిని ఎరుగని రేట్ పలకొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## సత్యదేవ్ కోరుకున్నది

# దొరికినట్లేనా?



తెలుగులో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ యంగ్ యాక్టర్లలో సత్యదేవ్ ఒకడు. కానీ తన ప్రతిభకు తగ్గ అవకాశాలు రావట్లేదని.. మంచి బ్రేక్ అందుకోవట్లేదని చాలామంది సినీ ప్రేమికులు బాధ పడుతుంటారు. ఇటీవలే వచ్చిన 'కింగ్డమ్' సినిమాలో కూడా సత్య చేసిన పాత్ర జనాలకు బాగా నచ్చింది. తన పెర్ఫామెన్స్‌కు ప్రశంసలు దక్కాయి. మెగాస్టార్ చిరంజీవి సినిమా 'గాడ్ ఫాదర్' లో విలన్ పాత్ర చేసి చిరుకు దీటుగా నిలబడ్డాడంటే అది తన టాలెంట్ వల్లే. ఇంకా అనేక పాత్రల్లో అతను అదరగొట్టాడు. కానీ హీరోగా మాత్రం కోరుకున్న బ్రేక్ రావట్లేదు. కొన్ని మంచి సినిమాలు చేసినా అవి ప్రేక్షకులకు రీచ్ కాలేదు. తన కెరీర్‌ను మారుస్తాయని అతను బలంగా నమ్మి చేసిన కొన్ని సినిమాలు ఆశించిన ఫలితాన్నందుకోలేదు. మొత్తంగా ఎంతో టాలెంట్ ఉండి కూడా ఒక స్థాయికి మించి ఎదగలేక ఇబ్బంది పడుతున్నాడు. తన కెరీర్ ఇలా ఉండడం మీద ఇటీవల మా ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో సత్యదేవ్ మాట్లాడాడు. తనకు ఓ పెద్ద ప్రొడక్షన్ హౌస్ బ్యాకప్ దొరక్కపోవడం కెరీర్‌కు ప్రతికూలంగా మారిందని సత్యదేవ్ అంగీకరించాడు. పెద్ద బేనర్లలో సినిమాలు చేస్తే వాటి రేంజ్ వేరు ఉంటుందని.. ప్రేక్షకుల రీచ్ కూడా పెరుగుతుందని.. కానీ ఇప్పటిదాకా తనకు ఆ బ్యాకప్ దొరకలేదని సత్యదేవ్ ఒకింత ఆవేదన వ్యక్తం చేశాడు. ఐతే ఇప్పుడు ఏకంగా మహేష్ బాబు సంస్థ సత్యదేవ్ సినిమాను నిర్మిస్తోంది. 'రావ్ బహదూర్' పేరుతో కొత్తగా సత్యదేవ్ హీరోగ్గా ఓ సినిమా అనౌన్స్ అయింది. ఇంతకుముందు సత్యతో 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' సినిమా తీసిన వెంకటేష్ మహా (కేరాఫ్ కంచరపాలెం ఫేమ్) ఈ చిత్రానికి దర్శకుడు. గతంలో మహేష్ బాబుతో కలిసి 'మేజర్' సినిమాను ప్రొడ్యూస్ చేసిన ఛాయ్ బిస్కెట్ అధినేతలు అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర.. 'క' నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డితో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# ఆ సీక్రెట్

## బయటపెట్టిన నటి !



టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలా మంది నటీమణులు ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇందులో కొంత మంది అతి తక్కువ కాలంలో పాపులర్ అయితే... మరి కొంతమంది సక్సెస్ కావడానికి ఇంకా కష్టపడుతున్నారు. ఇక మరికొంతమంది నటీమణులు అయితే... ఏజ్ పైబడినప్పటికీ వరుస ఛాన్స్ లతో దూసుకు వెళ్తున్నారు. అయితే అలాంటి లేడీ యాక్టర్స్‌లో సుధ ఒకరు. ఈ టాలీవుడ్ ఆంటీ... అనేక పాత్రలో నటిస్తూ.. తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పటివరకు 500 సినిమాల్లో ఆమె నటించింది. అతడు, దూకుడు, బాద్షా, గ్యాంగ్ లీడర్ లాంటి ఎన్నో సినిమాలలో ప్రత్యేక పాత్రల్లో కనిపించారు సుధ. అయితే ప్రస్తుతం ఆమె వయసు 61 సంవత్సరాలు దాటిపోయింది. అయినప్పటికీ యంగ్ హీరోయిన్లకు ఉన్న ఫిట్నెస్ ఆమె కూడా ఉంటుంది. అయితే అలా ఫిట్ గా ఉండడానికి గల కారణాలను తాజాగా రివీల్ చేసింది నటి సుధ. వాము, వేడి నీళ్లు కలిపి.. నిత్యం తాగుతానని తాజాగా వెల్లడించింది. దానివల్ల తాను ఇప్పటికీ కూడా యాక్టివ్ గా కనిపిస్తానని పేర్కొంది. అలా వేడినీళ్లు తీసుకుంటే శరీరంలో కొలెస్ట్రాల్ మొత్తం కరిగిపోతాయని వివరించింది. తాను అలా వేడి నీళ్లు చిన్నప్పటి నుంచి తాగుతున్నానని తెలిపింది. తన హెల్త్ సీక్రెట్ ఆ నీళ్లు మాత్రమేనని వివరించింది.

# తండ్రి కాబోతున్న మహేష్



జబర్దస్త్ షో ద్వారా చాలామంది పాపులారిటీ సంపాదించుకున్నారు. అలా ఫేమస్ అయిన వారిలో మహేష్ ఆచంట ఒకరు.ఈ షోలో తన కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాడు మహేష్. దీంతో రామ్ చరణ్ నటించిన 'రంగస్థలం' మూవీలో నటించే చాన్స్ వచ్చింది. ఆ తర్వాత చాలా చిత్రాల్లో కమెడియన్‌గా నటించి మెప్పించాడు. ప్రస్తుతం వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ కమెడియన్‌గా గుర్తింపు పొందుతున్నారు. ఇదిలా ఉంటే.. మహేష్ తాజాగా తన ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ చెప్పాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ షేర్ చేశాడు. అందులో తన భార్య అండ్ పాపతో దిగిన క్యూట్ ఫొటోస్ షేర్ చేశాడు. అయితే ఈ పిక్స్‌లో మహేష్ భార్య కడుపుతో ఉండటం విశేషం. దీంతో అతను మరోసారి తండ్రి కాబోతున్నాడనే విషయం అందరికీ తెలిసిపోయింది. ఇక ఈ ఫొటోస్‌కి 'ఒక అందమైన కొత్త అధ్యాయానికి నాంది' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారింది. ఇక దీన్ని చూసిన నెటిజన్లు ఈ జంటకు కంగ్రాట్స్ చెబుతున్నారు.

# నిధి అగర్వాల్‌కు ఇష్టమైన ఫుడ్



టాలీవుడ్ ఇండస్ట్రీలో నిధి అగర్వాల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో పాపులర్ అయిన ఈ అందాల తార... ఇటీవల హరిహర వీరమల్లు సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. త్వరలోనే ప్రభాస్ నటిస్తున్న రాజా సాబ్ సినిమాతో కూడా మరోసారి మెరువనుంది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తి కాగా... డిసెంబర్ లో మూవీ రిలీజ్ కానుంది. అయితే ఇలాంటి నేపథ్యంలో హీరో ప్రభాస్ అలాగే ఆయన పెద్దమ్మ శ్యామల దేవికి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పింది హీరోయిన్ నిధి అగర్వాల్. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియోను కూడా పంచుకుంది. తాజాగా ప్రభాస్ ఇంటి నుంచి...కాకినాడలో ఉన్న హీరోయిన్ నిధి అగర్వాల్ కు భోజనం వచ్చింది. ప్రభాస్ పెద్దమ్మ శ్యామలాదేవి ప్రత్యేకంగా.. ఆహారాన్ని వండి మరీ పంపినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆ వెజిటేరియన్ ఆహారాన్ని తింటూ నిధి అగర్వాల్ వీడియో చేశారు. తనకు ఇష్టమైన వెజిటేరియన్ ఆహారాన్ని ప్రభాస్ ఇంటి నుంచి పంపించారని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభాస్ అలాగే ఆయన పెద్దమ్మ శ్యామలాదేవికి కృతజ్ఞతలు కూడా తెలిపారు హీరోయిన్ నిధి అగర్వాల్. చివరలో ఫ్లయింగ్ కిస్ లు కూడా ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ గా మారింది.ఇక ప్రభాస్ ఇంటి నుంచి వచ్చిన భోజనం లో పప్పు, సాంబార్, పెరుగు, ఏపీ స్పెషల్ వంటకాలు, స్వీట్స్ ఉన్నాయి.

# అన్నదాతల అరిగోసలు

- యూరియా కొరకు పడిగాపులు.
- సొసైటీ, ఫెర్టిలైజర్ ల వద్ద రైతుల పడిగాపులు.
- ఫెర్టిలైజర్ యజమానులపై రైతుల మండిపాటు.
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతు సంఘాలు, ప్రజా సంఘాలు.






**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని యూరియా బస్తాలు దొరకక అన్నదాతల అరిగోసలు పడుతున్నారు. గత నెల రోజుల నుండి రైతులు యూరియా బస్తాల కొరకు నానా తంటాలు పడుతున్నారు. మంథనిలోని ప్రాథమిక వ్యవసాయ సహాకార సంఘం వద్ద ఉదయము నుండి పడి గాపులు పడాల్సిన పరిస్థితిలు నెలకొన్నాయి. క్యూ లైన్ లో గంటల తరబడి ఉండాల్సి వస్తుంది. ఒక్కరికి రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. అది కూడా రెండు మూడు రోజులు పడుతుంది. దీంతో ఉదయం నుండే యూరియా కొరకు పడిగాపులు రైతులు పడుతున్నారు. మంథని సొసైటీ , ఫెర్టిలైజర్ ల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఉంది. ఫెర్టిలైజర్ షాపుల్లో యూరియా అందుబాటులో ఉన్న రైతులకు ఇతర వ్యవసాయ మందులు కొంటేనే ఇస్తామని యజమానులు అంటున్నారు. దీంతో ఫెర్టిలైజర్ యజమానులపై రైతుల మండిపడుతున్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని ఫెర్టిలైజర్ యజమానులు ప్రతి ఏడు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యాపారం నడిపిస్తున్నారు. కానీ రైతులకు మాత్రం అవస్థలు తప్పడం లేదు. సొసైటీ కి రోజుకో యూరియా బస్తాల లోడ్ వచ్చిన కూడా రైతులకు మాత్రం యూరియా కొరతతో ఇబ్బంది తప్పడం లేదు. దీంతో వ్యవసాయ అధికారుల పై ప్రజాసంఘాలు , రైతు సంఘాలు, పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

# పరిశుభ్రతకు ప్రాధాన్యత

## ఇస్తున్న మున్సిపల్ కమిషనర్

- 10వ వార్డులో డ్రైనేజీలు శుభ్రం చేయిస్తున్న పెంటరి రాజు



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మున్సిపల్ పరిధిలోఈ మధ్యకాలంలో వర్షాలు అధికంగా కొనడంతో డ్రైనేజీ శుబ్ర పరచడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు మంథని పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటరి రాజు తెలిపారు. రాష్ట్ర ఐటి. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు లు వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించడంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకన్న సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం అలాగే దోమల బెడద లేకుండా బ్లీచింగ్ పౌడర్ మున్సిపల్ సిబ్బందితో చల్లించినట్లు రాజు పేర్కొన్నారు. వర్షాలు అధికంగా ఉన్న మూలంగా ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రపరచాలని ఆయన మున్సిపల్ కమిషనర్ను కోరారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కు పట్టణ ప్రజలు వివరించారు. ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బాలయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిషోర్ రెడ్డి, సోషల్ మీడియా జిల్లా ఇన్చార్జి ఆరెల్లి కిరణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పెరుగు సతీష్, కౌటం సాయి పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సత్రం భవన నిర్మాణాభివృద్ధికి సహాయం అందిస్తానన్న విప్ ఆది శ్రీనివాస్

- సత్రంలో తేనీటి విందుకు హాజరైన ఆది శ్రీనివాస్




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య వాసవి అన్నపూర్ణ నిత్యాన్నదాన సత్రం ట్రస్ట్లో బుధవారం తేనీటి విందు ఘనంగా జరిగింది. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ వాణి - పవన్ కుమార్ ఆహ్వానం మేరకు సత్రాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నూతన సత్రం భవన నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సత్రం నిర్మాణానికి,అభివృద్ధికి తనవంతు సహాయం అందిస్తానని, అలాగే త్వరలో జరగబోయే "గడప" కార్యక్రమానికి హాజరవుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొంటి రాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఇప్ప పూల అజయ్,ఏఎంసీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, సింగిల్ విండో డైరెక్టర్ తోటరాజు,కాంగ్రెస్ నాయకులు ముప్పిడి శ్రీధర్,గోపు తిరుపతి, కొండ శేఖర్,చింతపంటి రామస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ ను ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ వాణి - పవన్ కుమార్ దంపతులు శాలువా కప్పి ఘన సన్మానం చేసి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### కేంద్ర, రాష్ట్ర ఆదేశాల మేరకు

# ర్యాలీ నిర్వహించారు

- మంథని పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు సబ్బాని సంతోష్.
- బిజెపి ఆధ్వర్యంలో హర్గర్ తిరంగా ర్యాలీ తీసినారు.




**మంథని ( ప్రశ్న న్యూస్)** పెద్దపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ మాజీ అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి రాష్ట్ర నాయకులు చల్ల నారాయణ రెడ్డి కొండపాక సత్య ప్రకాష్ పాల్గొన్నారు. ఆజాధికా అమృత్ మహోత్సవ్"లో భాగంగామంథని పురవీధుల గుండా సాగిన ఈ హర్ ఘర్ తిరంగా ర్యాలీ లో భారీ ఎత్తున వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు మంథని పురవాసులు వివిధ పార్టీలకు సంబంధించిన కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చందుపట్ల సునీల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటి పైన మువ్వన్నెల త్రివర్ణ పతాకం ఎగరాలి ప్రతి మనిషి గుండెల్లో దేశభక్తి పొంగిపొర్లాలి అంటూ మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ దేశాన్ని ప్రపంచ స్థాయిలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా మార్చడానికి ప్రతి ఒక్కరు స్వదేశీ వస్తువులనే వాడాలి అంటూ పిలుపునివ్వడం జరిగిందని దానికి మనందరం కట్టుబడి ప్రయత్నం చేయాలని దేశ ప్రయోజనాల కోసం పార్టీలు పక్కన పెట్టి అందరం ఏకధాటిపైకి వచ్చి ఒకే మాటగా ముందుకు సాగాలని పిలుపునిస్తూ ఆపరేషన్ సింధూర్ తో మన దేశ సత్తా ప్రపంచాన్ని నివ్వరపరిచిందని దేశ ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించే భారత సైన్యానికి ప్రతి భారతీయుడు వెన్నుదన్నుగా ఉండాలని. ఈనాటి బాలలే రేపటి పౌరులు ఆ పౌరులే రేపటి ఈ దేశ బలమైన దేశభక్తి కలిగిన పునాదిరాళ్లుగా మారాలని. బాల్యం నుంచే పిల్లల్లో దేశభక్తి , పోరాటపటిమ ,బలమైన ఆశయాలు నెరవేర్చుకునే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని విద్యాసంస్థలకు వినమ్ర సూచన చేస్తూ ఈ కార్యక్రమం విజయవంతం అవడంలో సహకరించిన విద్యాసంస్థలకు మంథని పట్టణ వాసులకు వివిధ పార్టీల కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ సీనియర్ నాయకులు చిలువేరి సతీష్ పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్, ఎడ్ల సాగర్ పట్టణ కార్యదర్శి వేల్పుల సత్యం నాయకులు ఈసంపల్లి కొమరయ్య, మండల నాయకులు బూడిద విష్ణు, బొల్లంపల్లి లక్ష్మణ్, తోటపల్లి మహేష్ సదానందం పాల్గొనడం జరిగింది..

## రాఖీ పండగా అంటేనే అక్కచెల్లి బిఅన్నాతమ్ముల అనుభంధమని చాటి చెప్పిన ధమ్మన్నపేట్ తాండా వాసులు




ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం ధమ్మన్నాపేట్ తాండాకు చెందిన బాధావత్ సేవాలాల్ నిజామాబాద్ భారతీయా జనాతా పార్టీ ఎస్టి మోర్చా జిల్లా కోశాధికారి వారి అక్కలు,చెల్లెండ్లు తమా తమ్ముడి ప్రేమా అనురాగాలకు, అక్కలకు 85 సంవత్సరాల వయస్సు వచ్చిన కూడా తన తమ్ముడి ప్రేమా కొరకు మద్దుల్ తాండా,కేకే తాండా, భీంనగర్ తాండా, జక్రాన్ పల్లి వివేక్ నగర్ తాండా, కోరాట్ పల్లి తాండా, ధమ్మన్నపేట్ తాండా,డీబి తాండాల నుండి అక్కలు చెల్లెల అనుభంధం రక్ష భందన్ సంధర్భంగా తమా అక్కలు దూర ప్రాంతంలో ఉన్న కూడా తమా తమ్ముడికి ఎలాగైనా రాఖీ కట్టాలనే సంకల్పంతో నడవలేని స్థితిలో ఉన్నా కూడా కొందరు బస్సులో ఇంకొందరు ద్విచక్ర వాహణలపై తమా మనవలు సేవాలాల్ ఇంటి వద్ద దింపేసి వెళ్ళగానే తమా తమ్ముని చూసి సంతోషంతో గుండెలకు హత్తుకుని ప్రేమానురాగాలలో తమా తమ్ముడు వికాళాంగుడు అయిన కూడా తన మనస్సు వెన్నా అనీ, సేవాలాల్ అక్కలు,చెల్లెలు భాణావత్ మేణి, బుక్యా పిప్లీ, మూడవత్ కోమన్ తదితరులు వారు మాట్లాడుతూ, తమ తమ్ముడు అవిటివాడు అయినా కూడా తన మనస్సు మాత్రం అవిటిది కాదని సంతోషంతో తన తమ్ముడికి రాఖీ తన చేతికి కట్టి నిండు నూరేళ్లు చిరకాలం పిల్లాపాపలతో సుఖంగా వర్ధిల్లాలని దీవించారు. తమ అక్క చెల్లెల్లు అమ్మగారింటికి వచ్చిన సందర్భంగా సేవాలాల్ నిరుపేద కుటుంబానికి చెందిన వాడు అయినా కానీ,తన మనసు మాత్రం నిరుపేదది కాదనీ తన అక్కలకు తనకు తోచిన బహుమానం అందించి, భార్య భాదావత్ కవిత సేవాలాల్ ఇరువురు దంపతులు దీవేనలు అందుకున్నారు.

## రామడుగు ప్రాజెక్టు నీటిని విడుదల చేసిన రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి



**ధర్పల్లి (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ రూరల్ (డిచ్ పల్లి)(ధర్పల్లి)మండలం లోని రామడుగు గ్రామ శివారులో ఉన్న రామడుగు ప్రాజెక్టుకు సంబంధించిన కుడి ఎడమల కాలువల నుంచి నీళ్లను విడుదల చేశారు. రామడుగు ప్రాజెక్టు కట్టమీద ఉన్న కట్ట మైసమ్మ కి పూజ చేసి, అనంతరం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ రామడుగు ప్రాజెక్టు నుండి వివిధ గ్రామాలకు ఆయకట్టు ద్వారా నీళ్లు వెలుతాయని అన్నారు. ప్రాజెక్టు ఆయకట్టు క్రింద ఉన్న పంట పొలాలు ఎండి పోతున్న యని రైతులు ఎమ్మెల్యే కు విన్నవించుకోవడంతో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి,ఆయకట్టు పంట పొలాలకు బుధవారం రోజు నీళ్లను విడుదల చేయడం జరిగిందని అన్నారు. సుద్దులం, రామడుగు, మైలారం, కోరట్పల్లి, కలిగొట, చింతలూరు, మనోహరాబాద్ గ్రామాల పంట పొలాలకు నీరు చేరుతుందని అన్నారు. రైతులను రాజు చేయడమే ప్రభుత్వ లక్షమని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ వంటి పథకాలను అమలు చేయడం జరిగిందని అన్నారు.గత ప్రభుత్వం రైతులను విస్మరించిందని అన్నారు,అలాగే 42 శాతం బీసీ రిజర్వేషన్ కు టిఆర్ఎస్ బిజెపి నాయకులు వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, నిజాంబాద్ ఎంపీ అరవింద్, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ లు బీసీ రిజర్వేషన్ కు వ్యతిరేకామా? అనుకూలమా.? చెప్పాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. బీసీ రిజర్వేషన్ కొరకు రాజ్యాంగంలో 9వ షెడ్యూల్లో చేర్చాలని కేంద్రంపై బీజేపీ ఎమ్మెల్యేలు ఒత్తిడి తేవాలని అన్నారు. లేకపోతే బిజెపి ఎంపీలను గ్రామాల్లో తిరగకుండా బీసీ ప్రజలు తరిమి కొడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాలరాజ్, డిష్పల్లి మండల అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు, ధర్పల్లి మండల తహసిల్దార్ శాంత, ఎంపీడీవో లక్ష్మా రెడ్డి, రామడుగు వీడీసీ చైర్మన్ రాజారెడ్డి, సుద్దులం విడిసి చైర్మన్ సాయి రెడ్డి, రామడుగు గ్రామ శాఖ అధ్యక్షులు ఆనంద్,సుద్దులం గ్రామ శాఖ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజలు రైతులు పాల్గొన్నారు.

### అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా

# ప్రభుత్వం పని చేస్తుంది

- సుల్తాన్ పల్లి గ్రామం మాజీ సర్పంచ్ దండు ఇస్తారి



రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూస్)అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని సుల్తాన్ పల్లి గ్రామ మాజీ సర్పంచ్ దండు ఇస్తారి అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల పరిధిలోని సుల్తాన్ పల్లి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో గ్రామ వాస్తవ్యులు వహీదాకి ఎల్ఓసి రెండు లక్షల 50 వేల చెక్కును, అదేవిధంగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద నీరెడ్డి యాదమ్మకు 22,000 చెక్కును మాజీ సర్పంచ్ దండు ఇస్తారి ఆధ్వర్యంలో అందజేశారు . ఈ సందర్భంగా దండుఇస్తారి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్గని ప్రభాకర్ గౌడ్, మల్లికార్జున్, రాజు గౌడ్, తెరుపల్లి సిద్దయ్య, మైలారం రాజు, శివ గౌడ్, శ్యామ సాయికిరణ్, నీరటి సుధాకర్, నీరటి మహేందర్, మహమ్మద్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

## పర్మిషన్ లేని పరిశ్రమలపై అధికారులు చర్యలు తీసుకోవాలి

- సిఐటియు క్లస్టర్ కన్వీనర్ జాజుల రుద్ర కుమార్




రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్) పర్మిషన్ లేని పరిశ్రమలపై అధికారులు దృష్టి సారించాలని చర్యలు తీసుకోవాలని సిఐటియు క్లస్టర్ కన్వీనర్ జాజుల రుద్ర కుమార్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం జిహెచ్ఎంసి కార్యాలయం ముందు సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు కాటేదాన్ క్లస్టర్ కన్వీనర్ జాజుల రుద్రకుమార్ మాట్లాడుతూ కాటేదాన్ క్లస్టర్ పారిశ్రామిక ప్రాంతంలో సిఐటియు సర్వే అనంతరం విజయ నేహా లాంటి పరిశ్రమలు చాలా వరకు ఉన్నాయని వాటి వివరాలు రాతపూర్వకంగా వినతిపత్రంలో పొందుపరుస్తూ కమిషనర్ దృష్టికి తీసుకురావడం జరిగిందని అన్నారు. పరిశ్రమలపై పొల్యూషన్ బోర్డు పర్మిషన్ లేని పరిశ్రమల పై కార్మికుల సమస్యలపై సంబంధించిన పై అధికారులకు ఆఫీసులలో వినతిపత్రం రూపంలో సమస్య పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు.సిఐటియు నిరసనలు ధర్నాలు వినతిపత్రం రూపంలో ఇవ్వడం జరిగింది. అయినా పట్టించుకోవడం లేదు కాబట్టి జిహెచ్ఎంసి పరిధిలో ఉన్నటువంటి విత్ౌట్ పర్మిషన్ పరిశ్రమలను వెంటనే మూసివేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.అందులో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి అని ఆయన డిమాండ్ చేశారు.జిహెచ్ఎంసి కమిషనర్ అందుబాటులో లేని కారణంగా. ఇన్వార్డులో వినతిపత్రం ఇవ్వడంజరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కాటేదాన్ క్లస్టర్ కోశాధికారి పిసికే భాస్కర్. భవన నిర్మాణ కార్మిక సంఘం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి బి వెంకటయ్య. రాజు. స్వామి. తిరుమలేష్. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎం సూర్య ఘర్ స్కీం పై కలెక్టర్ సమీక్ష

- అవగాహన సదస్సులు, కార్యక్రమాల పై ఆరా



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన స్కీం పై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలులో భాగంగా జ జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో రెడ్కో అలాగే వివిధ శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్బు సమీక్ష సమావేశం నిర్వహించారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన స్కీంపై ఈ ఏడాది ఫిబ్రవరిలో సమీక్ష సమావేశం నిర్వహించగా.. మరోసారి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 5000 కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో ఈ పథకంపై వివిధ అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లో సౌర విద్యుత్ వినియోగించేలా డి ఆర్ డి ఓ, డి పి ఓ ఇతర శాఖల ఆధ్వర్యంలో సదస్సులు కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఈ పథకంలో భాగంగా అందించే సబ్సిడీపై వివరించారని కలెక్టర్ పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ వినియోగం ఎక్కువగా చేసే గ్రామాన్ని త్వరలో ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. సమీక్ష సమావేశంలో జెడ్పీ సీఈవో వినోద్ కుమార్ జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్ పంచాయతీరాజ్ శాఖ ఈ సుదర్శన్ రెడ్డి అడిషనల్ డి ఆర్ డి ఓ శ్రీనివాస్ లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్ రెడ్ కో డిఎం మునీందర్ రెడ్డి పిడిఓ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జూలూరు మూసి లెవెల్ బ్రిడ్జి, సంగం బ్రిడ్జులను పరిశీలించిన కమిషనర్



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** హైదరాబాద్లో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల ప్రభావంతో మూసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు భూదాన్ పోచంపల్లి వద్ద ఉన్న జూలూరు మూసి లో లెవెల్ బ్రిడ్జి, సంగం బ్రిడ్జులను పరిశీలించారు. వరదనీరు ఎక్కువగా వచ్చే పరిస్థితుల్లో రహదారులను తాత్కాలికంగా మూసివేయాలని అధికారులను సూచించారు. అలాగే, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు అధికారులు పూర్తిగా సిద్ధంగా ఉండాలని తెలిపారు.

# ప్రజలు తింటున్నది మేక మాంసమేనా.?

## - మటన్ వ్యాపారుల మాఫియా - ప్రజల ఆరోగ్యాలు ప్రమాదంలో

- శుభ్రత లేని మటన్ షాపులు - మున్సిపల్ అధికారుల మౌనం
- స్లాటర్ హౌస్ బయట వధలు - నిబంధనలు తుంగలో
- మామూళ్లతో సర్దుకుంటున్న అధికారులు
- కబేలాల బయట, ప్రభుత్వ ముద్ర లేని మాంసం అమ్మకాలు
- నగరంలో ఎక్కడపడితే అక్కడ మేకల మండీలు
- నాసిరకం మాంసం అమ్ముతూ ప్రజల నిలువు దోపిడీ





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలోని అనేక పురపాలక సంఘాలు, గ్రేటర్ మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మటన్ వ్యాపారులు సంబంధిత ప్రభుత్వ వెటర్నరీ డాక్టర్ సర్టిఫికేట్లు లేకుండా, మాంసం నాణ్యతపై ఎలాంటి తనిఖీలు చేయించకుండా, పరిశుభ్రతా ప్రమాణాలను పూర్తిగా పక్కన పెట్టి మటన్ విక్రయాలు జోరుగా కొనసాగిస్తున్నారు. ఈ నిర్లక్ష్యం వల్ల ప్రజల ఆరోగ్యాలు ముప్పుకు గురవుతున్నా, మున్సిపల్ అధికారులు, సానిటరీ ఇన్స్పెక్టర్లు తగిన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. మేకల మండీల పరిధిలో విధులు నిర్వహించే శానిటేషన్ వెటర్నరీ అధికారులకు ప్రతినెల భారీగా మామూలు అందుతున్నాయని అందుకోసమే పర్యవేక్షణ పూర్తిగా కనుమరుగైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### మటన్ విక్రయానికి అనుసరించవలసిన చట్టపరమైన నియమాలు

మటన్ లేదా ఎలాంటి మాంసం విక్రయం కోసం అయినా ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ.(ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా), ప్రభుత్వ మాంసం నిబంధనలు,అలాగే స్థానిక మున్సిపల్ చట్టాలు కొన్ని ముఖ్యమైన నియమాలను నిర్దేశించాయి. వీటిలో ముఖ్యమైనవి

### వెటర్నరీ సర్టిఫికేట్ తప్పనిసరి

జంతువు చంపేముందు, చంపిన తర్వాత కూడా సంబంధిత ప్రభుత్వ వెటర్నరీ డాక్టర్ పరీక్షించి 'ఫిట్ ఫర్ హ్యూమన్ కంజప్షన్' సర్టిఫికేట్ ఇవ్వాలి. అధికృత స్లాటర్ హౌస్( వధ శాల)లోనే వధ - పురపాలక సంఘం/కార్పొరేషన్ గుర్తించిన వధశాలలోనే జంతువులను వధించాలి కానీ ఎక్కడ వధశాలలో ఇలాంటి నిబంధనలు పాటించడం లేదు, అధికారులు అందుబాటులో ఉండరు, అయిన డ్యూటీ లో ఉన్నట్టు హాజరు పట్టికలో మాత్రం చూపుతూ నెల నెల మామూళ్ళు తీసుకొని మౌనంగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### పరిశుభ్రత ప్రమాణాలు..

- మాంసం విక్రయించే ప్రదేశం శుభ్రంగా ఉండాలి
- తగిన ఉష్ణోగ్రతలో నిల్వ చేయాలి (చల్లని నిల్వ %- 0%శీసి నుండి 4శీసి)
- దోమలు,ఈగలు,ఎలుకలు రాకుండా సురక్షిత ఏర్పాట్లు చేయాలి

### లైసెన్స్ అండ్ రిజిస్ట్రేషన్..

- స్థానిక మున్సిపల్ లైసెన్స్,ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ. రిజిస్ట్రేషన్ ఉండాలి

### ప్రజా ప్రదర్శన నిబంధనలు..

మాంసాన్ని రోడ్డుపక్కన, ఎండలో,తెరిచి ఉంచకూడదు.
- మున్సిపల్ కౌన్సిల్/కార్పొరేషన్ కమిషనర్లు అండ్ సానిటరీ ఇన్స్పెక్టర్ల బాధ్యతలు
- ప్రమాణాలకు విరుద్ధంగా మాంసం విక్రయిస్తే తనిఖీలు చేసి వెంటనే సీజ్ చేయడం
- లైసెన్స్ లేని మటన్ షాపులపై పెనాల్టీలు, కేసులు నమోదు చేయడం, వాటిని తొలగించడం.
- అధికృత స్లాటర్ హౌస్ వెలుపల వధ జరిగితే జంతు మాంసాన్ని స్వాధీనం చేసుకోవడం
- ప్రజా ఆరోగ్యాన్ని కాపాడే చర్యలు తీసుకోవడం
- శానిటేషన్, హైజీన్ నియమాల అమలు
- మాంసం వ్యాపారులపై ప్రమాణాల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం

### ప్రజలకు ముప్పు - వ్యాధుల సంక్రమణ...

పరిశుభ్రత లేకుండా, వెటర్నరీ సర్టిఫికేట్ లేకుండా విక్రయిస్తున్న మాంసం వల్ల ఫుడ్ పాయిజనింగ్, టైఫాయిడ్, కలరా, పరాన్నజీవుల వ్యాధులు, హెపటైటిస్-ఇ వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ప్రత్యేకంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఈ ముప్పుకు ఎక్కువగా గురవుతారు.


### ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అంశాలు..

- అన్ని మున్సిపల్ పరిధిలో తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలి
- లైసెన్స్ లేని మటన్ షాపులను శాశ్వతంగా మూసివేయాలి
- ప్రతీ వధకు వెటర్నరీ హెల్త్ సర్టిఫికేట్ తప్పనిసరి చేయాలి
- పరిశుభ్రత ప్రమాణాలు పాటించని వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. కఠిన చర్యలు లేకపోతే నిర్లక్ష్యం కొనసాగి, రాబోయే రోజుల్లో ప్రజల ఆరోగ్య ముప్పు మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్లాటర్ హౌస్(వధశాల) బయట మేకలను పోసి ఇలాంటి అనుమతులు లేకుండా బహిరంగంగా అమ్ముతున్న ఒక్క అధికారి కూడా దీనిపై చర్యలు తీసుకోకపోవడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా మున్సిపల్ శాఖ ఉన్నత అధికారులు ప్రిన్సిపల్ సెక్రెటరీ స్పందించి వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా మండీల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా మటన్ విక్రయాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## హైదరాబాదులో ఫ్రీ చాయ్

# ఎక్కడో తెలుసా.?




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఉదయం లేవగానే చాయి తాగనిదే దినచర్య మొదలుపెట్టని వారు ఎంతో మంది ఉన్నారు. చాయ్ తాగకపోతే ప్రాణాలు పోయేంత ఆత్రుత పడేవారు ఎంతోమంది ఉన్నారు. హైదరాబాదులో పట్టణాలలో 20 రూపాయలు పెట్టనిది చాయి దొరకని ఈ రోజుల్లో హైదరాబాద్ మహానగరంలో ఉచిత చాయిని అందిస్తున్నారంటే ఆశ్చర్య పడవలసిన విషయమేగా హైదరాబాదులో మాసబ్ ట్యాంక్ మహావీర్ హాస్పిటల్ ప్రక్కన డాక్టర్ రబిందర్ నాథ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కడక్ చాయ్ కౌంటర్ ని ఏర్పాటు చేసి ప్రజలకు గరం గరం చాయిన్ ని అందిస్తున్నారని ఆంజనేయులు తెలిపారు. స్వచ్ఛమైన బర్రె పాలు బెల్లముతో చాయిని తయారు చేస్తామని ఈ చాయ్ ఎంతో మధురంగా ఉంటుందని చాయ్ ని తాగడం ద్వారా షుగర్, బీపీ లాంటి వ్యాధులు రావని కడక్ చాయ్ తాగడం వల్ల ఎంతో ఉత్సాహంగా ఉంటారని కడక్ చాయిని ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ పరిధిలో మరిన్ని ఉచిత చాయ్ కౌంటర్లు ఏర్పాటు చేయడానికి నిర్వాహకులు సిద్ధంగా ఉన్నారు. ఎవరైనా ముందుకు వచ్చి ఉచిత చాయ్ కౌంటర్ నిర్వహిస్తే వాళ్లకు పూర్తి సహాయ సహకారాలు అందించడానికి నిర్వాహకులు సైతం ఆసక్తి చూపుతున్నారు. మనం త్వరలో హైదరాబాద్ పరిధిలో మరిన్ని ఉచిత చాయ్ కౌంటర్లు పొందే అవకాశం లేకపోలేదు.

## లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో

# పార్కింగ్ సమస్య తీవ్ర రూపం

### - పట్టించుకోని అధికారులు సమస్యలలో వాహనదారులు




**శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)** లింగంపల్లి రైల్వే స్టేషన్ పరిసరాల్లో పార్కింగ్ సమస్య రోజురోజుకీ తీవ్రమవుతోంది. ముఖ్యంగా ప్లాట్‌ఫారమ్ నంబర్-1 వైపు దూబే కాలనీ ప్రవేశద్వారం వద్ద పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇక్కడ ట్రాఫిక్ ఎప్పుడూ రద్దీగా ఉండటమే కాక, దూబే కాలనీ మెయిన్ రోడ్‌పై ఉన్న హోటళ్లు రహదారిని ఆక్రమించి టేబుళ్లు, కుర్చీలు, వంట సామగ్రి పెట్టడం వల్ల ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదనంగా ఈ రోడ్ వెడల్పు కేవలం 20 ఫీట్లు మాత్రమే ఉండటంతో నిత్యం వాహనాలు ఒకదానితో ఒకటి ఇరుక్కుపోయే పరిస్థితి నెలకొంటోంది. ఆర్‌సీపురం ట్రాఫిక్ పోలీసులు, రైల్వే సిబ్బంది, అలాగే శేర్లింగంపల్లి జిహెచ్ఎంసి అధికారులు ఈ సమస్యపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులను ఆవేదనకు గురి చేస్తోంది. ట్రాఫిక్ పోలీసుల, జిహెచ్ఎంసి అధికారులు వెంటనే రోడ్డుకు ఇరువైపులా ఉన్న కబ్జాలను తొలగించి రోడ్డు పై ట్రాఫిక్ సమస్య రాకుండా నిత్యం ట్రాఫిక్ పోలీసులు మెగా ఏర్పాటు చేయాలని, జటిలంగా ఉన్న ఈ సమస్య పరిష్కారానికి తక్షణ మే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నీ అవినీతికి దండం..

# నీ అక్రమాలు ఆపేదెవరు



- మల్కాజిగిరి టౌన్స్ ప్లానింగ్ ఏసిపి బాల శ్రీనివాస్ అడుగు అడుగున బాధ్యతారాహిత్యం
- ఏసిపి నిర్లక్ష్యంతో మల్కాజిగిరిలో ఆగని ఆక్రమణల పర్వం
- రైల్వే ట్రాక్ సమీపంలోనే అనుమతులు లేకుండా బరితెగించి నిర్మాణం - లంచాలు తీసుకొని చోద్యం చూస్తోన్న ఏసీపీ బాల శ్రీనివాస్
- వివరణ అడుగుతే చర్యలు తీసుకుంటాం ఇదే ఎప్పటికీ ఏసీపి సమాధానం, చర్యలు మాత్రం ఉండవు


ప్రజాప్రశ్న
రైల్వే ట్రాక్ సమీపంలోనే అక్రమ నిర్మాణాలు



మల్కాజిగిరి(ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసి పరిధిలో అధికారుల అవినీతి అక్రమాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. మల్కాజ్గిరి సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ బాల శ్రీనివాస్ బాధ్యతారాహిత్యం అంతా ఇంతా కాదు పత్రికలో కథనాలు వచ్చిన నన్ను ఎవరు ఏం చేయలేరు అన్నట్లుగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ చర్యలు తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న జోనల్ కమిషనర్ రవి కిరణ్ జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ నిమ్మకు నీరతనట్లు వ్యవహరించడం విడ్డూరంగా మారింది. కిందిస్థాయి అధికారులు అవినీతిపై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోకుంటే ఇక అవినీతిని పెంచి పోషించినట్లే అని నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత అధికారులు డమ్మీలు అయితే పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతూనే ఉంది. నిబంధనలను తుంగలో తొక్కి, ఎసిపి బాల శ్రీనివాస్ అండదండలతో కొందరు అక్రమార్కులు బరితెగిస్తున్నారు. కాకతీయ నగర్‌లో రైల్వే ట్రాక్‌కు అత్యంత సమీపంలో అక్రమ నిర్మాణం వెలుస్తున్నా, అధికారులు చోద్యం చూస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.రైల్వే నిబంధనలు బేఖాతరు చేస్తూ నిర్మాణం సాగిస్తున్న ఏసిపి లంచాలు తీసుకొని మౌనంగా ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రైల్వే ట్రాక్‌లకు సమీపంలో ఎలాంటి నిర్మాణం చేపట్టాలన్నా రైల్వే శాఖ నుంచి నిరభ్యంతర పత్రం తప్పనిసరి. ట్రాక్ భద్రత, భవిష్యత్తు విస్తరణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిబంధనను ఖచ్చితంగా అమలు చేయాల్సి ఉంటుంది. అయితే, కాకతీయ నగర్‌లో చేపడుతున్న ఈ నిర్మాణానికి రైల్వే అధికారుల నుంచి ఎలాంటి ఎన్ఓసీ తీసుకోలేదని స్థానికులు పేర్కొన్నారు. అత్యంత ప్రమాదకరంగా ట్రాక్‌ను ఆనుకొనే ఈ నిర్మాణం జరుగుతున్నా రైల్వే అధికారులు గానీ, స్థానిక మున్సిపల్ అధికారులు గానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. మల్కాజిగిరి ప్రధాన రహదారి పక్కనే రెసిడేన్షియల్ అనుమతులతో కమర్షియల్ నిర్మాణాన్ని చేపట్టినా , ఇక్కడి అక్రమ నిర్మాణంపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమని వాపోతున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శించి, మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారని, అందుకే ఈ నిర్మాణాలను అడ్డుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పత్రికలో కథనాలు వచ్చిన ఏసీపి బాల శ్రీనివాస్ పై చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే ఉన్నతి అధికారులకు సైతం మామూలలో వాటాలు అందుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు సైతం ఈ వ్యవహారంలో ప్రేక్షక పాత్ర పోషిస్తుండటం వెనుక ఆంతర్యమేమిటో అంతుచిక్కడం లేదని తెలుస్తోంది.కాకతీయ నగర్‌లో వెలుస్తున్న ఈ నిర్మాణానికి మున్సిపల్ శాఖ నుంచి కూడా ఎలాంటి అధికారిక అనుమతులు లేవని దీని వెనక ఏసిపి బాల శ్రీనివాస్ లక్షలలో లంచాలు తీసుకొని మౌనంగా ఉన్నారని కనీస నిబంధనలు పాటించకుండా, నాణ్యతా ప్రమాణాలను గాలికి వదిలేసి ఈ కట్టడాన్ని నిర్మిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణం వల్ల భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదం జరిగినా ఎవరు బాధ్యత వహిస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు వెలిసినా, టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, ఇది అక్రమార్కులకు మరింత అలుసుగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, సిసిపి శ్రీనివాస్ %ఓ% ఉన్నతాధికారులు స్పందించి, రైల్వే ట్రాక్ సమీపంలో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణంపై ఉక్కుపాదం మోపాలని, బాధ్యులైన మున్సిపల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588